

# గుంటూరు వార్త

## వైభవంగా భావనారుషి కళ్యాణం

రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:రేపల్లె పాతబస్తీ పద్మశాలీ వారి వీధిలో శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కళ్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్వామి వారి ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.వి.నాగేశ్వరరావు, ఎ.శ్యాంసుందరరావు, టి.నారాయణరావు, పడవల గోపీచంద్,ఆర్ .వి.కాళేశ్వరరావు, ఎం.వెంకటేశ్వం రావు, ఎం.నాగేశ్వర రావు,బి.ఈశ్వర ప్రభాకరావు, బి.వెంకటేశ్వరరావు ,కె.సుబ్బారావు,ఎం.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

## మంత్రి అనగాని సత్యప్రసాద్

**రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్య ప్రమాణాలకు పరిరక్షణ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి నెలలో 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. శనివారం రేపల్లె పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సభలో మంత్రి



అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు నాయుడు గత సంవత్సరం 2025 సంవత్సరం జనవరిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్త తొలగించడానికి తమ ప్రభుత్వానికి సంవత్సర కాలం పట్టిందన్నారు. రేపల్లెలో డంపింగ్ యార్డు సమస్య కారణంగా చెత్త నిల్వలు పేరుకుపోయిన పరిస్థితులు తనకు తెలుసునన్నారు. పట్టణానికి దూరంగా డంపింగ్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తే ఒక గ్రామానికి చెందినవారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సాధ్యపడలేదన్నారు. ప్రస్తుతం తడి, పొడి చెత్తను వేరు చేసి సాయంత్రానికల్లా పవర్ ప్లాంట్‌కు తరలించడం వలన డంపింగ్ యార్డు సమస్య లేకుండా పోయిందన్నారు. దసరా, విశాఖ, గండికోట, రథసప్తమి ఉత్సవాలను నిర వ్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతున్నదన్నారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనగాని చెప్పారు. విద్యార్థులు కోరిన విధంగా ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లోతట్టు ప్రదేశాన్ని మెరక చేయిస్తామని చెప్పారు. విద్యాసంస్థల మైదానంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. పరిశుభ్రత విషయంలో 6 మున్సిపాలిటీలు, 10 గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో కూడా అవార్డులు లభించడం విశేషమన్నారు. బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జనను అరికట్టేందుకు మరుగుదొడ్ల పథకాన్ని అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. పేదవాడి సంక్షేమం కోసం పనిచేస్తున్నామని తెలిపారు. ఉద్యానవనాలలో వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ మిషన్లలో పనికిరాని చెత్త వేస్తే ప్రోత్సాహకంగా నగదు పొందవచ్చునన్నారు. చంద్రబాబు విజన్, పవన్ కళ్యాణ్ ఆలోచన, నరేంద్రమోడీ ఆశీస్సులతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తున్నామని చెప్పారు. తండ్రీ తనయులు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లు పెట్టుబడులు తీసుకువచ్చేందుకు రోజుకు 20 గంటలు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ అస్తవ్యస్థ పాలన కారణంగా అభివృద్ధిలో 30 సంవత్సరాలు వెనక్కు వెళ్ళిపోయామని అనగాని సత్యప్రసాద్ చెప్పారు. విశాఖపట్నాన్ని ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు. తిరుపతి ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. తీరప్రాంతంలో రూ.97 కోట్ల వ్యయంతో నిరుద్యోగులకు ఉపాధి లభించేందుకు ఒక మంచి అవకాశం రాబోతోందన్నారు. చీరాల, బాపట్ల ప్రాంతాలు అభివృద్ధిపథంలో దూసుకుపోతాయన్నారు. ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రేపల్లె-తుమ్మల డబుల్ రహదారి నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయిందని మంత్రి అనగానిచెప్పారు. రేపల్లె నియోజకవర్గంలో



రహదారుల అభివృద్ధి జరుగుతోందన్నారు. చెప్పినట్లుగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నకాంటీన్, జాబ్ క్యాలండర్ అమలు చేస్తున్నామన్నారు. 20 లక్షలకు మించిన ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి అనగాని వెల్లడించారు. బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ప్రజల సంక్షేమం నెరవేరడం అభినందనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలవుతున్న నిధులతో ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ మడఅడవులలో పర్యటించినప్పుడు చెత్త పేరుకు పోయిన పరిస్థితులు గమనించామన్నారు. ఎకోటూరిజంలో రేపల్లె, నిజాంపట్నం ప్రాంతాలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన చెప్పారు. హౌస్ బోట్లకు పెట్టుబడులు పెట్టే 3 కంపెనీల ప్రతినిధులు, టూరిజం శాఖ అధికారులతో కలిసి మడ అడవులలోకి వెళితే సముద్రం దగ్గర చెత్త పేరుకుపోయిందన్నారు. మత్స్యకారులను అడిగితే పై ప్రాంతంలోని కెనాల్‌లో వేసిన చెత్త ఇక్కడకు చేరుకుంటున్నదని చెప్పారని పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తెలుగుదేశం పార్టీ నాయకులు అనగాని శివప్రసాద్, వంతాని మురళీధరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో

# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 24, ప్రభాతవార్త :** గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజలు ప్రతి భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ కే మయూరి అశోకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పివికే నాయుడు



మార్కెట్లో చెత్త శుభ్రత పనులలో నిమగ్నమయ్యారు. మార్కెట్లో వ్యర్థాలను తొలగించి నగర పరిశుభ్రతపై ప్రజలకు ఒక సందేశాన్ని ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వర్ విజ్ఞాన మందిరం ఎదురుగా ఉన్న టాయిలెట్లను శుభ్రం చేసే పనిలో పాల్గొన్నారు. అనంతరం విజ్ఞాన మందిర్ లో నగర పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారని మేయర్ రవీంద్ర వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న చిన్న పల్లెటూరు నుంచి పట్టణాల వరకు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మంచి లక్ష్యంతో సీఎం ఈ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ఇటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త కార్యక్రమాల్లో భాగంగా ప్రతి శనివారం ఇటువంటి కార్యక్రమాలు అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో ప్రజా ప్రతినిధులను, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను, ప్రజలను, విద్యార్థులను మమేకం చేస్తూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకథీమ్ ప్రకారం చేపట్టే ఇటువంటి కార్యక్రమాలతో పాటు



పారిశుద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, రోడ్లపై చెత్త నిలువ లేకుండా ఎప్పటికప్పుడు తరలింపు, మురుగుపారుదలకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్, పూడికతీత పనులు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలకు మంచి జరిగేటటువంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో పాటు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని నగర పరిశుభ్రంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. కార్పొరేషన్ లోన్ అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 కోట్లతో రహదారుల అభివృద్ధి : మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:పురపాలక సంఘంలోని 3,8,12,13,26 వార్డులలో రూ.2 కోట్ల వ్యయంతో సిమెంట్ రహదారులను నిర్మించామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. శనివారం నూతన సిసి రోడ్లు, డ్రెయిన్లు, ఆధునీకరించిన ఉద్యానవనాలను మంత్రి అనగాని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మౌలిక సదుపాయాల అమలుకు ప్రాధాన్యతని



స్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సురక్షిత మంచినీరు, ఆహ్లాదకరమైన ఉద్యానవనాలు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రేపల్లె పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని సత్యప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్, రేపల్లె ర్డీవో ఎన్.రామలక్ష్మి ,మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివ రావు,మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ రిహార్సల్ పరేడ్ పరిశీల

గుంటూరు క్రైమ్, జనవరి24, ప్రభాతవార్త: గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నద్ధతలో భాగంగా ఆర్మీ, పోలీస్ బలగాలు నిర్వహించిన రిహార్సల్ పరేడ్‌ను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు ఐఏఎస్ శనివారం పరిశీలించారు. అమరావతి రాజధాని పరిధిలో ఈ నెల 26వ తేదీన జరగనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా, ఆర్మీ, పోలీస్









బలగాలు, విద్యార్థి బృందాలు కలసి "ఫుల్ డ్రెస్సు రిహార్సల్ పరేడ్"ను రాయపూడి గ్రామంలోని మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రాష్ట్ర డీజీపీ వేడుకల ఏర్పాట్లపై రాష్ట్ర అదనపు డీజీపీ (లి వీ) మధుసూదన్ రెడ్డి, బెటాలియన్స్ ఐజీ రాజకుమారి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీ, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తో చర్చించారు. ఈ రిహార్సల్ పరేడ్ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు ముఖ్య అతిథులుగా హాజరై, ఆర్మీ, పోలీస్ బలగాలు, విద్యార్థి బృందాలు పరేడ్ కమాండర్ (ప్రస్తుతం జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా పనిచేస్తున్నారు) ఆర్. సుస్మిత ఆధ్వర్యంలో సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు డీజీపీ (లి వీ)మధుసూదన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తదనంతరం రిహార్సల్ పరేడ్ ముఖ్య అతిథులైన రాష్ట్ర డీజీపీ, పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, పరేడ్ కమాండర్, పరిశీలన వాహనంలో పర్యటించి, ఆర్మీ, పోలీస్ బలగాలు, విద్యార్థి బృందాల పరేడ్‌ను పరిశీలించారు. రంగుల రంగుల యూనిఫార్ములు ధరించిన బలగాలు, విద్యార్థి బృందాల సమన్వయ క్రమశిక్షణ, సంగీత బృందాల సుమధుర గీతాల స్వరాలతో రిహార్సల్ పరేడ్ ఎంతో ఆకర్షణీయంగా సాగింది. పరేడ్‌లో పాల్గొన్న అందరూ సమన్వయంతో ప్రదర్శన నిర్వహించారు. ఇదే సమన్వయాన్ని గణతంత్ర దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో కొనసాగించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ రిహార్సల్ పరేడ్ కార్యక్రమంలో భారత ఆర్మీ, ఆంధ్రప్రదేశ్ 2వ పోలీస్ బెటాలియన్, సి.ఆర్.పి.ఎఫ్, పోలీసు సాయుధ దళాలు, ఆంధ్రప్రదేశ్ 16వ పోలీస్ బెటాలియన్, బాలురు-బాలికల విభాగాల ఎన్‌సిసి క్యాడెట్లు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థల విద్యార్థులు, రెడ్ క్రాస్ యువ దళం కంటింజెంట్లు పాల్గొన్నారు. స్పెషల్ పోలీస్ బ్రాస్ బ్యాండ్, స్పెషల్ పోలీస్, భారత ఆర్మీ మ్యూజిక్ బ్యాండ్లు తమ సంగీతంతో కార్యక్రమాన్ని అలరించాయి.

## మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి పూర్తి సహకారం

### -రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్

**మంగళగిరి, జనవరి 24, ప్రభాతవార్త :** ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న అమరావతిలో మంగళగిరి ఎయిమ్స్ ఓ మణిహారంగా ఉండబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎయిమ్స్ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 190 ఎకరాల్లో ఇంకా కేటాయించాల్సి ఉన్న మరో 10 ఎకరాలను ప్రభుత్వం త్వరగా కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీనివల్ల ట్రామాకేర్ కూడా అందుబాటులోనికి వస్తుందన్నారు. గత ప్రభుత్వం ఎయిమ్స్ కు మంచినీటి సదుపాయాన్ని సైతం కల్పించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర కృషితో అమరావతి అద్భుత రాజధానిగా తయారవు తోందన్నారు. ఎయిమ్స్ 8వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం మంగళగిరిలోని ఎయిమ్స్ ఆవరణలో శనివారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మాట్లాడు తూ మంగళగిరి ఎయిమ్స్ సేవలు అనతి కాలంలోనే రోగుల విశ్వాసం పొందిందని ప్రశంసించారు. దేశంలోని 26లో 19 ఎయిమ్స్ నిర్వహణలో ఉండగా మిగిలి నిర్మాణాల దశలో ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ చొరవవల్ల ఎయిమ్స్ విరివిగా ఏర్పడుతున్నాయన్నారు.

**ప్రభుత్వాసుపత్రుల్లో పెరిగిన ఓపి, ఐపీ, డయాగ్నస్టిక్ సేవలు..**

ఎయిమ్స్ తో పోల్చితే తక్కువ బడ్జెటుతో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల ద్వారా రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఎయిమ్స్ కు ఏడాదికి రూ.500 కోట్లు కేటాయిస్తుండగా రాష్ట్రంలోని బోధనాసుపత్రులకు సగటున రూ. 150 కోట్ల చొప్పున అందుతున్నాయన్నారు. అయినప్పటికీ రాజీపడకుండా రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వాసుపత్రుల ద్వారా నిరంతరం కృషి జరుగుతోందన్నారు. గత 19 నెలలు కూటమి ప్రభుత్వ పాలనలో వైద్య, ఆరోగ్య శాఖలో కీలకమైన, ఆశాజనకమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ రూపొందించిన 30 పాయింట్ల అజెండా అమలు ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ, ఐపీ, ల్యాబ్ టెస్టులు 8 నుంచి 12 వరకు పెరిగాయన్నారు. వైద్యుల అనధికార హాజరు తగ్గిందని, నిర్ణీత సమయానికి పదోన్నతులు ఇస్తున్నామని, ఉచితంగా అన్ని రకాల మందులు ఇస్తున్నామని, డయాగ్నిస్టిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రసవాల సంఖ్య ప్రభుత్వాసుపత్రుల్లో పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

**పీపీపీ విధానంపై విష ప్రచారం..**

ఉత్తమ విద్యార్థులు, ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను నడపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయిస్తే, బయట విష ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ మండిపడ్డారు. వాస్తవాలు వక్రీకరిస్తూ ప్రజలను పక్కదోవపట్టించే పార్టీలకు రాజకీయ భూస్థాపితం




కావడం ఖాయమని పేర్కొన్నారు. పీపీపీ విధానంలో నడిచే ప్రభుత్వ వైద్య కళాశాలలపై యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దనే ఉంటాయని స్పష్టం చేశారు.

నేను బ్యాక్ బ్నెచి బ్యాచ్ కావడంతో జీవితంలో వినోదం ఓ భాగంగా ఉండాలని, అదే జీవితంగా ఉండకూడదని వైద్య విద్యార్థులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హితవు పలికారు. తాను చిన్న వయసులో వైద్యుడ్ని కావాలనుకున్నా. బ్యాక్ బెంచీలో ఉన్నందున ఉత్తమ మార్కులు సాధించలేకపోయినట్లుచెప్పారు. దీంతోళఇంజినీరింగ్ చదవాల్సి వచ్చిందని తెలిపారు. ఇంటి నుంచి తాను సచివాలయానికి వెళ్లాలన్నా.. సచివాలయం నుంచి ఇంటికి వెళ్లాలన్నా మంగళగిరి ఎయిమ్స్ ను చూస్తుంటానని తెలిపారు. ఎయిమ్స్ నుంచి రాకపోకలు సాగిస్తుండడం తీయని అనుభూతిని కలిగిస్తోందన్నారు. ప్రత్యేక అతిథి పద్మశ్రీ డాక్టర్ నళిని పార్థసారథి, గౌరవ అతిథి కంబైన్డ్ కంబాట్ మెడికల్ సర్వీసెస్ ఆఫ్ సీపీఎంఎఫ్ఎస్ డాక్టర్ ఆర్.ఎస్.రాథోర్, మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.ఎస్.సింగ్, ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్, మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ తపన్ కుమార్ సింగ్ కూడా ప్రసంగించిన వారిలో ఉన్నారు.

**ఒరిజినల్ దస్తావేజులు పోయినవి**

బాపట్ల జిల్లా (మం) శ్రీనివాస నగర్ 1వ లైను కాపురస్తుడు మాసాబత్తుని సత్యనారాయణ గారి కుమారుడు మాసాబత్తుని పవన్‌కుమార్ గారికి గుంటూరు పట్టణంలో శ్రీనివాసరావు తోట 6వ లైను 4వ అడ్డరోడ్డు నందు గల సర్వేనెం. 519 ,వార్డు నెం.22, బ్లాక్‌నెం.18 ల్యాండ్ నందు చ.గ 140 ఖాళీ స్థలము నందు ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం. 1) 4376 21-07-2009, 2) 6169 03-06-2014, 3) 2078 01-03-2019 గల డాక్యుమెంట్లు బాపట్ల నుండి పొన్నూరు వస్తుండగా పోయినవి. దొరికిన వారు సంప్ర: 9000962348.

## పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

**గుంటూరు, జనవరి24, ప్రభాతవార్త :** నేడు "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు" మరియు " కోపా విసన్నపేట " వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలులో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 247 మంది పేద విద్యార్థులకు తొమ్మిది లక్షల యాభై వేల రూపాయలు(..9,50,000/ )ఉపకార వేతనాలు గా పంపిణీ చేయనున్నా రు. ఇందులో నాలుగు లక్షల ముప్పై మూడు వేల రూపాయలు(..4,33,000/ )తులసి సీడ్స్ వారు "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ " ద్వారా 114 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం విసన్నపేట లోని వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణ



నందు మధ్యహ్నాం ప్రారంభమోతుంది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి వితరణ చేయ నున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలియజేశారు. ఇట్లుతులసి గ్రూప్ మీడియా విభాగం

## వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకులు అరెస్టు

**గుంటూరు క్రైమ్, జనవరి24, ప్రభాతవార్త:** పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పండరీపురం 5వ లైన్ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో, ఆ సమాచారాన్ని ఎస్‌బి సిఐ-1 కి తెలియజేయగా, టాస్క్ ఫోర్స్ సిఐ ఆదేశాల మేరకు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలసి శనివారం దాడి నిర్వహించారు. ఈ దాడిలో 1 ఆర్గనైజర్, 3 మహిళలు, 2 విటులు మొత్తం 6 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 మొబైల్ ఫోన్లు, రూ.1,960/ నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని, స్వాధీనం చేసుకున్న వస్తువులను తగిన న్యాయపరమైన చర్యల కోసం పట్టాభిపురం పోలీస్ స్టేషన్ వారికి అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఫలాలిచ్చే పరిశోధనలపై దృష్టిసారించాలి

### - మాజీ వీసి ఆచార్య బాలమోహన్ దాస్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి24, ప్రభాతవార్త:** నేటి పరిశోధనలు సమాజాభివృద్ధికి ఫలాలిచ్చే విధంగా ఉండాలని ఏఎన్‌యు మాజీ వీసి ఆచార్య వి.బాలమోహన్ దాస్ పిలుపునిచ్చారు.. ఏఎన్‌యులోని సెంటర్ ఫర్ గాంధియన్ స్టడీస్ ఆధ్వర్యంలో పరిశోధకులకు శోధ్ ఆర్గనైజేషన్‌తో కలిసి రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం ఆచార్య బాలమోహన్ దాస్ సెమినార్ హాల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పరిశోధకులు విలువలతో కూడిన పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రపంచ దేశాలలో జరుగుతున్న పరిశోధనా విధానాలు, పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎన్‌యు ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావవు మాట్లాడుతూ నూతన సాంకేతికతను వినియోగించుకుని పరిశోధనలు చేయాలన్నారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ నేటి పరిశోధనలు రేపటి భవిష్యత్‌కు




దిక్సూచీగా నిలవాలన్నారు. శోధ్ స్టేట్ ఇన్‌చార్జ్ డా. సందీప్, డా.ఎన్.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పరిశోధనల్లో భారతీయ మూలాలను, విజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌కుమార్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌కు 158 మంది పరిశోధకులు, 8మంది ప్రొఫెసర్లు హైద్రాబాద్ సెంట్రల్, ఏపి సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పాల్గొన్నారన్నారు. ఏబివిపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్, కార్యదర్శి వెంకటగోపీ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా వార్త






# రైతుల్లో ఆనందం నింపిన ఎడ్ల బలప్రదర్శన

## 6 రోజులు, 150కి పైగా ఎడ్ల జతలు, రూ.35లక్షల నగదు బహుమతులు-3లక్షలకు పైగా తరలివచ్చిన ప్రజలు

చిలకలూరిపేట, జనవరి 24, ప్రభాతవార్త: టీడీపీ సీనియర్ నాయకులు, మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నేతృత్వంలో, ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ప్రత్యేక అతిథులుగా 10 మంది రాష్ట్ర మంత్రులు, ఒక కేంద్రమంత్రి, నరసరావుపేట ఎంపీ విచ్చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, చీఫ్ విప్, ప్రభుత్వ విప్ లతో పాటు శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రముఖ విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, కూటమిపార్టీల ప్రధాన నాయకులు అదనపు ఆకర్ష 6 రోజులు జరిగిన పోటీలకు ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన మంత్రులు తొలిరోజు : మంత్రి గొట్టిపాటి రవికుమార్ : ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు. రెండో రోజు : మంత్రులు కొలుసు పార్థసారథి, డోలా బాలవీరాంజనేయస్వామి : ఎమ్మెల్యేలు అరవిందబాబు, తెనాలి శ్రావణ్ కుమార్. మూడో రోజు : మంత్రి సవిత, చీఫ్ విప్ జీవీ.ఆంజనేయులు. నాలుగో రోజు : మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, ఏలూరి సాంబశివరావు, కందుల నారాయణ రెడ్డి, అరిమిల్లి రాధాకృష్ణ. చింతమనేని ప్రభాకర్. ఐదో రోజు : మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, సత్యకుమార్, ఆరో రోజు : కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, భాష్యం ప్రవీణ్ వీరితో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి



పట్టాభిరామ్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరామ్ ప్రసాద్, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ కుర్రా అప్పారావు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ ఛైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు, పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డితో పాలు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, గుంటూరు రేంజ్ ఐటీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావుతో పాటు తదితరులు హాజరయ్యారు. ప్రముఖ విద్యావేత్త భాష్యం రామకృష్ణ, తానా మాజీ అధ్యక్షులు, ఎన్నారై కోమటి జయరాం, జనసే నాయకులు పెంటేల బాలాజీ, బిజెపి నాయకులు ఏలూరి శశి కుమార్, స్థానిక కూటమి నేతలు చివరిరోజు పోటీల్లో ప్రత్యేక అతిథులుగా మెరిశారు.

## ఘనంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం

### -హాజరైన కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, జనవరి 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్‌లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనే ధ్యేయంగా




ప్రభుత్వం పనిచేస్తోందని వారు పేర్కొన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను ఎమ్మెల్యే కన్నా తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో చెత్త పై పన్ను వేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త పై పన్ను తొలగించటం జరిగిందన్నారు. స్వచ్ఛాంధ్రకోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ డబ్బాల నివారణకు స్వచ్ఛందంగా ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

### సత్తెనపల్లిలో జిల్లా కలెక్టర్ పర్యటన చిత్రాలు



శనివారం వాటర్ ప్లాంట్‌లను ఆకస్మిక తనిఖీచేసిన కలెక్టర్ కృతికా శుక్లా, చిత్రంలో ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ కృతికా శుక్లా



జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు బహుమతులుఅందజేసిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా.. (సత్తెనపల్లి-ప్రభాతవార్త)

## బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన

యడ్లపాడు, జనవరి 24, ప్రభాతవార్త: రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు ఆదేశాల మేరకు చిలకలూరిపేట మండల న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం సెయింట్ ఆన్స్ విద్యాసంస్థ లు ఎడ్లపాడు లో విద్యార్థులకు బాల్యవివాహాల నిషేధ చట్టం 2026 గురించి వివరించడమైనది. ఈ చట్టం ప్రకారము 18 ఏళ్ల నిండకుండా ఆడపిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా బాలురకు




వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరం అని వివరించారు సమాజంలో ఆడపిల్లలను మగ పిల్లలను వ్యత్యాసం చూపకూడదని ఆడపిల్లలు ఏ రంగంలోనైనా ముందంజలో అడుగులు వేయాలని వివరించారు ఆడపిల్లలపై అగత్యాలు అత్యాచారాలు ఎక్కువవుతున్నాయి కనుక చాలా జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని వివరించారు ప్రతి ఒక్కరూ తమ యొక్క ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటికోసం కృషి చేయాలని తెలిపినారు మరియు ప్రభుత్వ పథకాలను గురించి కూడా వివరించారు పి వెంకటేశ్వరరావు సీనియర్ న్యాయవాది, టీ రామాంజనేయులు ఎం ఎల్ ఎస్ సి మెంబరు, ఎం భాను ప్రసాద్ ప్యానల్ లాయర్,. ఎడ్లపాడు ఏఎస్ఐఎస్కె ఇస్మాయిల్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జ్ఞానమేరి, పారాలిగల్ వాలంటీర్ మరియు స్కూల్ విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు

## బాలికా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థినులకు అవగాహన

యడ్లపాడు, జనవరి 24, ప్రభాతవార్త : జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జగ్గాపురం జడ్పీహెచ్ఎస్, తిమ్మాపురం జడ్పీహెచ్ఎస్ లో జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అవగాహన కల్పించినారు. విద్యా, పోషణ,చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవము, బాల్యవివాహాల గురించి సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి అమ్మాయిలు సాధారణంగా వారి జీవితంలో



ఎదుర్కొంటున్న వివిధ రకాల సాంఘిక వివక్ష దోపిడీని తొలగించే అవసరం గురించి పూర్తి అవగాహన,రాజకీయ కమ్యూనిటీ న్యాయాలు సమాన విద్య,ప్రాథమిక స్వేచ్ఛ కోసం అవగాహన కల్పించడం జరిగినది. సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు నిర్వహించారు. ఉప అధ్యక్షుడు వై ప్రసాదరావు, స్కూల్ హెడ్మాస్టర్ మరియు టీచర్స్, బాలికలు పాల్గొన్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకొని చురుగ్గా సమాధానాలు చెప్పిన వారికి బాలికలకు బహుమతులు ఇచ్చినారు.

## బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన

యడ్లపాడు, జనవరి 24, ప్రభాతవార్త : మండల కేంద్రమైన యడ్లపాడు లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముక్య అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పీవీ సుబ్బారావు పాల్గొని



మాట్లాడారు. బాలికలు ఎదుర్కొంటున్న మానసిక, సమస్యలు, పరిష్కార మార్గాలు గురించి ఆయన మాట్లాడారు. మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ నేడు అన్నిరంగాలలో మహిళలు రాణిస్తున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన మాట్లాడుతూ ధైర్యంలోనే విజయం ఉందన్నారు. జనవి జ్ఞానవేధి రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు, హేతువాద సంఘం నాయకులు షేక్ చిన్న మస్తాన్ తదితరులున్నారు.

## అసైన్డ్ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని జెసికి వినతి

యడ్లపాడు, జనవరి 24, ప్రభాతవార్త : నరసరావుపేట కలెక్టర్ ఆఫీస్‌లో శనివారం నిర్వహించిన ఎస్సీ ఎస్టీ గ్రీవెన్స్ లో భాగంగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహకి ఎడ్లపాడు మండలంలోని 150 ఎకరాలు అసైన్డ్ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాల్సిందిగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న జనతావారధి కార్యక్రమంలో భాగంగా, ఎడ్లపాడు మండల అధ్యక్షులు తులాబంధుల సత్యనారాయణ, జనతా భారతి ఎడ్లపాడు మండలం కన్వీనర్ దాట్ల వెంకటేశ్వర రాజు గారి ఆదేశాల మేరకు కోకన్వీనర్ బండెల శ్రీనివాసరావు అర్జీ సమర్పించడం జరిగింది. ఎడ్లపాడు మండలంలోని 150 ఎకరాలు 2009వ సంవత్సరంలో ఎస్సీ కమిషన్ సేకరించి తహశీల్దార్ స్వాధీనంలో ఉంచటం జరిగిందని, 150 ఎకరాలు భూమిని పంపిణీ చేయాలని 2010లో తాసిల్దారు వారు పత్రిక ప్రకటన కూడా జారీ చేయడం జరిగిందన్నారు. ఈరోజు వరకు కూడా పంపిణీ జరగలేదు. 27 డిసెంబర్ 2025 ఎస్సీ ఎస్టీ గ్రీవెన్స్ అర్జీ కలెక్టర్ కు సమర్పించడం జరిగిందిని. ఆర్డీవో నరసరావుపేట వారు వచ్చి క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించడం జరిగింది, ఇప్పటికి నెల అవుతుంది, ఈరోజు వరకు కూడా మా సమస్య పరిష్కారం కాలేదు అని తెలియజేయటం జరిగిందన్నారు.



## స్వచ్ఛ.. స్వర్ణాంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు జీవిత లక్ష్యం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 24, ప్రభాతవార్త: స్వచ్ఛాంధ్ర : స్వర్ణాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు జీవిత లక్ష్యమని, నాయకుడి ఆలోచనల సాకారం ప్రజలందరి బాధ్యతని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టంచేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలు, పారిశుధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ప్రజలు




తప్పనిసరిగా సహకరించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే అంతిమంగా అందరూ నష్టపోతారని ప్రత్తిపాటి తెలిపారు. పట్టణంలో బహిరంగ మల,మూత్ర విసర్జన జరగకుండా మున్సిపల్ సిబ్బంది, స్థానిక కౌన్సిలర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. చెత్తతో నిండి, దుర్గంధం వెదజల్లే వీధుల పరిశుభ్రతతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు తగు సూచనలు చేస్తూ, వారిని కూడా శుభ్రతలో భాగస్వాములను చేయాలని ప్రత్తిపాటి సూచించారు. ఆరుబయట మలమూత్ర విసర్జన చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిలో మార్పువచ్చేలా వినూత్నంగా ప్రచారం చేపట్టాలని ఎమ్మెల్యే మున్సిపల్ యంత్రాంగాన్ని ఆదేశించారు. అవసరమైతే ప్రజాసేవను ఇష్టపడే బాధ్యతాయుత వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి, పట్టణ అపరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం వెనుక అపరిశుభ్రంగా ఉన్న బజార్ లో రూ.2లక్షల నిధులతో కాంక్రీట్ వేయించి, రంగులద్ది, మొక్కలు ఏర్పాటుచేసిన ఆలయ కమిటీ సభ్యుల్ని ప్రత్తిపాటి అభినందించారు. పట్టణంలో అదేవిధంగా అపరిశుభ్రంగా ఉన్న వీధులసమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, టీడీపీ నాయకులు మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు, కనమర్లపూడి రమేష్, తోట బ్రహ్మస్వాములు, కొండా వీరయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మోలాలి, జంగా సుజాత, కంచర్ల కరుణ, కునలా ప్రమీల, తెలుగు మహిళా నాయకులు, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 30న చలో విజయవాడ 'నిరుద్యోగి రణభేరి'ని జయప్రదం చేయండి

చిలకలూరిపేట, జనవరి 24, ప్రభాతవార్త: రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న "నిరుద్యోగి రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి సీపీఐ సుభాని కోరారు. శనివారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ సుభాని మాట్లాడుతూ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం "కొలువులకై కొట్లాడుదాం" అనే నినాదంతో ఈ పోరాటాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిరుద్యో గుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి... ప్రభుత్వం తక్షణమే అధికారికంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న భారీ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని




డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. తొలగించిన వాలంటీర్లను విధుల్లో కొనసాగిస్తూ, వారికి రూ. 10,000 గౌరవ వేతనం ఇవ్వాలని, జూనియర్, డిగ్రీ కళాశాలలు యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏపీ బెవరేజెస్, రేషన్ వాహనాల్లో తొలగించిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, నూతన పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న విజయవాడలో జరిగే ఈ మహా ప్రదర్శనకు నిరుద్యోగ యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిస్త్రీ ఏరియా కార్యదర్శి కె మల్లికార్జున్,పట్టణ కన్వీనర్ రాంబాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు

## వర్సిటీ అంతర కళాశాలల సాఫ్ట్‌బాల్ టోర్నీలో చుండి రంగనాయకులు కళాశాల జట్టుకు ప్రథమస్థానం

చిలకలూరిపేట, జనవరి 24, ప్రభాతవార్త: జనవరి 22,23 తేదీల్లో ఆర్ వి ఆర్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల సాఫ్ట్బాల్ టోర్నమెంట్ 2025 -26 సంవత్సరం శ్రీ చుండి రంగనాయకులు కాలేజ్ టీం పథమస్థానం కైవసం చేసుకుంది టీంలో నలుగురు విద్యార్థులు ఆల్ ఇండియా లెవెల్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ కు సెలెక్ట్ అయినా ప్లేయర్స్ నేమ్స్ నరేంద్ర బీకాం సెకండ్ ఇయర్ సాయి బీకాం సెకండ్ ఇయర్ సాగర్ బాబు బీకాం సెకండ్ ఇయర్ భూపతి బీఎస్సీ ఫస్ట్ ఇయర్ అవటం జరిగింది గత 13 సంవత్సరల నుండి సి ఆర్ కాలేజ్ టీం సాఫ్ట్ బాల్ గేమ్ నందు ప్రథమ బహుమతి




కైవసం చేసుకుంటూ వస్తుంది సి ఆర్ కాలేజ్ యాజమాన్యం ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్ ,డైరెక్టర్ చుండి రంగనాయకుల విద్యతో పాటుగా స్పోర్ట్స్ మరియు ఇతర రంగములలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యార్థుల బంగారుభవిష్యత్తుకు బాట వేస్తున్నారు సి ఆర్ కాలేజీ విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులు ఇటీవల జరిగిన డీఎస్సీ మరియు పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ లో మా విద్యార్థులు స్పోర్ట్స్ కోట నందు సెలెక్ట్ అవటం జరిగింది విద్యార్థులను పిడి నాగేంద్రబాబు ను కాలేజీ యాజమాన్యం ప్రిన్సిపాల్ మరియు స్టాఫ్ అందరూ అభినందించారు

## హోరాహోరీగా రాష్ట్రస్థాయి మట్టి కుస్తీ పోటీలు

చిలకలూరిపేట, జనవరి 24, ప్రభాతవార్త: చిలకలూరిపేట వేదికగా రాష్ట్రస్థాయి మట్టి కుస్తీ పోటీలు సందడిగా ప్రారంభం కానున్నాయి. శ్రీ వీరాంజనేయ మల్ల యుద్ధ వ్యాయామశాల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్జా పాండురంగారావు, పల్నాడు జిల్లా సెక్రెటరీ పి. మావో శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బి (ఆ తీ) గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు ఈ పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వేదిక చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు. పాల్గొనేవారు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పురుషులు మరియు మహిళా



పహిల్వాన్లు ఈ పోటీల్లో తలపడనున్నారు. ప్రధాన పురస్కారాలు సీనియర్ విభాగంలో విజేతలకు ఖిఆంధ్ర కేసరిఖి టైటిల్‌తో పాటు గదను బహూకరిస్తారు. పురుషుల విభాగంలో అత్యధిక పాయింట్లు సాధించిన వారికి ఖిజ్యోతిరావు పూలే స్మారక షీల్డ్ఖి అందజేస్తారు.శ్రీ వీరాంజనేయ మల్లయుద్ధ వ్యాయామశాల అధ్యక్షులు పెరుబోయిన వెంకటేశ్వర్లు మరియు కమిటీ సభ్యులు ఈ పోటీలకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరిన్ని వివరాలకు ..పి. మావో శ్రీనివాసరావు: 9391077411 ..ఆర్జా పాండురంగారావు: 7396225080 ..పెరుబోయిన వెంకటేశ్వర్లు: 9293732993 సంప్రదించాలని కోరారు.

## ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు: పాల్గొన్న 'ప్రత్తిపాటి'

చిలకలూరిపేట, జనవరి 24, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలో వేంచేసియున్న శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం నందు మాఘమాస శుద్ధ పంచమి నుంచి మాఘమాస శుద్ధ ఏకాదశి వరకు ఆలయ అర్చకులు శ్రీమాన్ పూసులూరి వెంకట రామకృష్ణ ఆచార్యులు పర్యవేక్షణలో, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కళ్యాణ మందిర సంఘం కమిటీ వార్ల ఆధ్వర్యంలో జరుగుచున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు నిర్వహించిన శేషవాహన సేవ గ్రామోత్సవం



కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామి వారి గ్రామోత్సవం ప్రారంభించిన అనంతరం ఆలయ కమిటీ వారు ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజల్లో శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

## పొలాలను పరిశీలించిన వ్యవసాయ సంచాలకులు

యడ్లపాడు, జనవరి 24, ప్రభాతవార్త : మండల పరిధిలోని పంట పొలాలను శనివారం కమిషనర్ మరియు వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మనజీర్ జిలాని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడ్లపాడు గ్రామంలో సెనగ, మొక్కజొన్న, మిరప తదితర పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. సెనగ, మొక్కజొన్న పంటల పెట్టుబడి, ఎరువులు, పురుగుమందుల వాడకం, కౌలు ఖర్చు, దిగుబడి అంచనా, మార్కెట్ ఇబ్బందులు వంటి అంశాల గురించి రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఏ హరి ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎన్. అనుపమ, ఉప్పలపాటి శ్రీనివాసరావు తదితర రైతులు పాల్గొన్నారు.



## డీఎస్పీ ఆధ్వర్యంలో మాచర్లలో కార్డన్ సెర్చ్

మాచర్ల, జనవరి 24 ప్రభాతవార్త: స్థానిక వినాయకుడి గుట్ట ప్రాంతంలో శనివారం పోలీసులు భారీ ఎత్తున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గురజాల డీఎస్పీ జగదీష్ నేతృత్వంలో సుమారు 100 మందికిపైగా పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టి, ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా సోదా చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 48 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు అనుమానాస్పదంగా ఉన్న పనిముట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనేటప్పుడు సరైన పత్రాలు ఉన్నాయా లేవా అని పరిశీలించాలన్నారు. లేని వాటిని కొని ఇబ్బందులు పడొద్దని సూచించారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ సీఐ తురక వెంకటరమణ, రూరల్ సీఐ నఫీజ్‌బాషా, కారంపూడి సీఐ శరత్‌బాబుతో పాటు ఎస్సైలు వెంకటరమణ, రమేష్, రూరల్ ఎస్సై సంధ్యారాణి, సాగర్ ఎస్సై అశోక్, వెల్దుర్తి ఎస్సై సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## 27న న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా

మాచర్ల, జనవరి 24 ప్రభాతవార్త: మాచర్ల మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల నిర్వాహకులు రవీంద్రబాబు, అనిల్‌కుమార్‌లు శనివారం తెలిపారు. ఈ మేళాలో 2021, 2022, 2023 పాసైన విద్యార్థులతోపాటు, చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా హాజరు కావొచ్చన్నారు. బీటెక్, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీకాం, బీఎస్సీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డిప్లొమా విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 9494470797, 9030557045 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## జీరో గ్యాప్ శానిటేషన్‌పై అవగాహన



కారంపూడి, జనవరి 24 ప్రభాతవార్త: స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ పాఠశాలలో జీరో గ్యాప్ శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, మనచుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మల్లయ్య, మలేరియా సూపర్‌వైజర్ లాలునాయక్, హెచ్‌ఎం శివశేషిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సువర్ణరాజు, గోవిందనాయక్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

పిడుగురాళ్ల, జనవరి 24 ప్రభాతవార్త : స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో శనివారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణా, పోషకాహారంపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, శ్రీదేవి, ప్రిన్సిపాల్ వనజ, ఎస్‌కె పర్వానా, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.



## వివేకానంద స్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సు



పిడుగురాళ్ల, జనవరి 24 ప్రభాతవార్త : పట్టణంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో శనివారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి ప్రవల్లిక పాల్గొని విద్యార్థినులకు బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు జరిపిన వారు, సహకరించిన వారు నేరస్తులేనన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ, న్యాయవాదులు మౌలాలి, శ్రీనివాసరావు, ఏడుకొండలు, లోకేశ్వరి, పల్లవి, మాణిక్యం, రమేష్, ప్రశాంత్‌కుమార్ నాయక్, పారా లీగల్ వాలంటీర్లు నవ్య, రామకృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో పరిటాల రవి వర్ధంతి



గుంటూరు, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ మంత్రి, జననేత పరిటాల రవి వర్ధంతి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్, జాతీయ అధికార ప్రతినిధి మాల్యాద్రి, నేతలు పర్చూరి కృష్ణ తదితరులు పాల్గొని పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రీసర్వే అనేది భూ సంస్కరణ కాదు.. అది జగన్ సృష్టించిన భూ వివాదాల పుట్ట
## డేటా ట్రాన్స్‌ఫర్‌లో విఫలమై వెబ్లాండ్ వ్యవస్థను
## సర్వనాశనం చేసిన జగన్ రెడ్డి : మంత్రి 'కొండపల్లి'



గుంటూరు, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధి: వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్ల పాలనలో చేపట్టిన భూ రీసర్వే అనేది రైతుల మేలు కోసం చేసిన సంస్కరణ కాదు, అది కేవలం భూకబ్జాలకు దారి వేసేందుకు వేసిన ఒక పక్కా వ్యూహమని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూ రీసర్వే అంశంపై జగన్ రెడ్డి క్రెడిట్ తీసుకోవాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన ఈ ప్రయోగం వల్ల ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది భూ యజమానులు, సామాన్య రైతులు కోర్టులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాను ఉదాహరణగా చూపిస్తూ, అక్కడ గత 18 నెలలుగా తాను వ్యక్తిగతంగా జరిపిన సమీక్షల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయని మంత్రి తెలిపారు. జిల్లాలో ఉన్న మొత్తం రెవెన్యూ సమస్యల్లో 70 శాతం కేవలం జగన్ సర్కార్ అస్తవ్యస్తంగా నిర్వహించిన రీసర్వే వల్లే తలెత్తాయని వివరించారు. బ్రిటిష్ కాలం నాటి పారదర్శక రికార్డులు, లింక్ డాక్యుమెంట్లు స్పష్టంగా ఉన్నప్పటికీ.. అధికారులకు శిక్షణ ఇవ్వకుండా, తగిన సమయం కేటాయించకుండా బలవంతంగా రీసర్వేను రుద్దడం వల్ల వ్యవస్థ మొత్తం గందరగోళంలో పడిందని విమర్శించారు. వలస వెళ్లిన రైతుల భూములను సైతం పట్టించుకోకుండా లక్షలాది జాయింట్ ఎల్పీఎం లు సృష్టించి, రైతుల ఆస్తులను చిక్కుల్లో నెట్టేశారని ధ్వజమెత్తారు. వెబ్లాండ్1లో ఉన్న పూర్తి భూ చరిత్రను పట్టించుకోకుండా, హడావుడిగా వెబ్లాండ్2కి మారడం వెనుక భారీ కుట్ర దాగి ఉందన్నారు. సుమారు 13.59 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేసిన గత ప్రభుత్వం, అందులో 5.74 లక్షల ఎకరాల అర్హత లేని భూములను చేర్చడం వారి దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ గందరగోళాన్ని చక్కదిద్దుతోందని, రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 2,34,664 రెవెన్యూ ఫిర్యాదులను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారని తెలిపారు.

## రికార్డులలో సర్వే నంబర్ మార్చి భూమి కబ్జాకు
## యత్నించిన వైసీపీ నేతలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు



గుంటూరు, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణాజిల్లా గన్నవరంకు చెందిన కోటేశ్వరరావు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. కంచికచర్ల మండల పరిధిలోని సర్వే నంబర్ 549/2ఏ లో తన స్వంత భూమిని సాగు చేసుకుంటున్నాను. అయితే కనీసం సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ రికార్డులలో సర్వే నంబర్ 549/2తిని 549/11గా మార్చడం జరిగింది. ఈ సాంకేతిక మార్పును సాకుగా చూపి వైసీపీకి చెందిన కొంతమంది గుండాలు తమ భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు. వైసీపీకి చెందిన స్థానిక గుండాలు తమపై దాడులకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి వేళ ట్రాక్టర్లతో వచ్చి సుమారు ఒక ఎకరా మినుము పంటను వైసీపీ గుండాలు దొంగిలించారు. ఈ విషయంపై పోలీసుల సమక్షంలో సదరు వ్యక్తులు తమ తప్పును అంగీకరించారు. తమ కౌలుదారుడు వేసిన అరటి మొక్కలను కూడా ధ్వంసం చేశారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ గద్దె అనురాధలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. మార్కాపురం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 179లో విస్తీర్ణం ఎకరాలు 10.09 సెంట్ల పొలము ఉంది. ఈ పొలానికి పూర్వకాలం నుంచి గ్రామంలో ఉన్న బండిదారి ద్వారానే రాకపోకలు సాగిస్తూ వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నాము. అయితే ఇదే గ్రామానికి చెందిన పగడాల శ్రీనివాసులు అనే వ్యక్తి, అతని తండ్రి సుబ్బయ్య పేరుతో, సదరు బండిదారిని పూర్తిగా ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బిల్డింగ్ నిర్మాణం చేపట్టాడు. ఈ అక్రమ నిర్మాణం వల్ల తమ పొలానికి వెళ్లే దారి పూర్తిగా మూసివేయబడింది. తమ పొలానికి వెళ్లే దారి లేక వ్యవసాయం పూర్తిగా నిలిచిపోయింది. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు. పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన అన్నపూర్ణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన 3 సెంట్ల డి.కె. పట్టా స్థలంలో నివసిస్తున్నాను. గత 6 ఏళ్లుగా స్థలం కోసం పోరాడుతున్నాను. గ్రామానికి చెందిన స్థానిక వ్యక్తులు జయప్రకాష్, తుర్లపాటి గంగాధరరావు, వారి కుటుంబ సభ్యులు తనపై దౌర్జన్యం చేస్తున్నారు. తన స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరుగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# పల్నాడు జిల్లా వార్త



## నాటక రంగాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

నరసరావుపేట, జనవరి 24 ప్రభాతవార్త నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాలులో నెలవారి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక నాటికలు, వినోదాత్మక కార్యక్రమాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తెలుగువారి గొప్ప సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళా–నాటక రంగాన్ని కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. నేటి సమాజంలో యువతను మంచి మార్గంలో నడిపించడంలో కళలకు విశేష పాత్ర ఉందని, నాటకాలు, జానపద కళారూపాలు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అలాంటి కళారూపాలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం కొనసాగుతుందని, కళాకారుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ "జబర్దస్త్" కార్యక్రమానికి చెందిన యాక్టర్లు ప్రదర్శించిన నాటికలు, హాస్య కార్యక్రమాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ కార్యక్రమాలను ఆస్వాదిస్తూ చప్పట్లతో ఉత్సాహపరిచారు. కార్యక్రమ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందిస్తూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహించడం ద్వారా ప్రజల్లో కళలపై ఆసక్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.





## 26న కొండవీడు ఇఎన్‌టీలో ఉచిత వైద్యశిబిరం
### -అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు

నరసరావుపేట, జనవరి 24 ప్రభాతవార్త ::రిపబ్లిక్‌డే సందర్భంగా స్థానిక కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్‌లో ఉచిత చెవి, ముక్కు, గొంతు వ్యాధుల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల డాక్టర్ కె.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వైద్యశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రతి ఏడాది జాతీయ దినోత్సవాల సందర్భంగా మూడుసార్లు తమ వైద్యశాలలో ఉచిత వైద్యశిభిరాలు నిర్వహించి ఉచితంగా పరీక్షలు, మందులు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ఈనెల 26న రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు వైద్యశిభిరం నిర్వహిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి పరీక్షించి 30శాతం రాయితీపై వినికిడి పరికరం అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా లేకున్నా అందరికీ ఫ్రీగా వైద్యం చేస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిలో పదిమంది పేదలను గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. గురక వ్యాధితో బాధపడేవారికి సైతం వైద్యం అందజేస్తామన్నారు. డాక్టర్ శ్రీ వర్షిణి, డాక్టర్ విష్ణురాజు పాల్గొన్నారు.



## ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం

నరసరావుపేట క్రైమ్, జనవరి 24 ప్రభాతవార్త ::జాతీయ భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆర్‌టీసీ వైద్యశాలలో (డిస్పెన్సరీ) నిర్వహించిన రక్తదాన శిభిరంలో 75మంది ఆర్‌టీసీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు రక్తదానం చేశారు. శిభిరాన్ని ఆర్‌టీసీ జిల్లా రవాణా అధికారిటి.అజిత్‌కుమారి, డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ, ఏరియా వైద్యశాలకు చెందిన రక్తనిధి కేంద్రంకు సంబందించిన వైద్యసిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. డిస్పెన్సరీ డాక్టర్ ఎన్.ఎన్.రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి: జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట టౌన్, జనవరి 24 ప్రభాత వార్త ::విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామం లోని కెరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో శనివారం జరిగిన సైన్స్ ఎక్స్పో2026 కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్.పి బి.కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు లకు స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేర్వు, డైరెక్టర్లు కొమటనేని నాసరయ్య, కనుమూరి బాజీ చౌదరి ఘన స్వాగతం పలికారు. సైన్స్ ఎక్స్పోలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, పునరుత్పాదక శక్తి వంటి విభాగాలకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, శాస్త్రీయ ఆలోచనలను, వినూత్న ప్రాజెక్టులు ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ఎస్.పి బి. కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్లు సాంకేతిక పరిజ్ఞానంయువతలోసృజనాకృత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని పెంచి దేశాభివృద్ధికి దోహదపడే పౌరులుగా తీర్చి దిద్దుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి జెవి సంతోష్, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇంఛార్జ్ కోట బాపూజీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.




## జాతీయ వైద్య ప్రవేశ పరీక్ష (నీట్-సూపర్ స్పెషాలిటీ)లో
## డాక్టర్ కడియాల తపస్విని ప్రతిభ

నరసరావుపేట, జనవరి 24 ప్రభాతవార్త : నరసరావుపేటకు చెందిన డాక్టర్ కడియాల తపస్వినికి జాతీయ వైద్య ఎంట్రన్స్ (సూపర్ స్పెషాలిటీ)పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకు లభించింది. 2025-నీట్ సూపర్ స్పెషాలిటీ పరీక్షలలో ఆమె 1153 ర్యాంకును సాధించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కడియాల రమేష్ లక్ష్మీ దంపతుల కుమార్తె లక్షల మంది పోటీ పడే సూపర్ స్పెషాలిటీ నీట్ పరీక్షల్లో పోటీబడి పల్నాడు జిల్లాకే గర్వకారణంగా ర్యాంకును సాధించడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్లమంద గ్రామానికి చెందిన తపస్విని పదవ తరగతి నరసరావుపేట, ఇంటర్ విజయవాడలోనూ, ఎంబిబిఎస్ ను ఏలూరు మెడికల్ కళాశాలలో, ఎండి జనరల్ మెడిసిన్ ను మణిపాల్ లోను వారు పూర్తి చేశారు. మల్టీ స్పెషాలిటీ జాతీయ వైద్య పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన తనకు న్యూరో మల్టీ స్పెషాలిటీ విభాగంలో వైద్య విద్యను కొనసాగించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎల్లమంద గ్రామంలో జన్మించి విశేషమైన ప్రతిభతో వైద్య విద్యలో తపస్విని ముందుకు వెళుతున్నారు. నరసరావుపేటలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు కుటుంబానికి చెందిన వారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తో పాటు, ఐఎంఏ వైద్యులు, పలువురు రాజకీయ ప్రముఖులు డాక్టర్ తపస్వినితో పాటు తల్లిదండ్రులు డాక్టర్ కడియాల రమేష్‌లక్ష్మీ దంపతులకు అభినందనలు తెలిపారు.



## దుర్గి మార్కెట్ యార్డు ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలి: ఎమ్మెల్యే 'జూలకంటి'



మాచర్ల, జనవరి 24 ప్రభాతవార్త: దుర్గి మార్కెట్ యార్డు ఆదాయాన్ని పెంచేలా నూతన కమిటీ సభ్యులు వినూత్న ఆలోచనలు చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ యార్డు నూతన కమిటీ సభ్యుల సాధారణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, కమిటీ డైరెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని రకాల రైతు ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను దుర్గి మార్కెట్ యార్డులో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు మేలు చేయాలని ఇక్కడ మిర్చియార్డు నిర్మాణం జరిపితే, ఐదేళ్లు యార్డును నిరుపయోగంగా మార్చారని వైసీపీ పాలనపై మండిపడ్డారు. రైతు ఉత్పత్తుల కొనుగోళ్లతోపాటు రైతులకు యంత్రాలను కూడా అందించే దిశగా అడుగులు పడాలని ఆయన కోరారు. అనంతరం ఛైర్మన్ లింగా బ్రహ్మయ్య, వైస్ ఛైర్మన్ సత్య నారాయణ, డైరెక్టర్లను ఆయన అభినందించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ఈసిలో జూబిలేషన్ 2కె 26 టెక్నో, మేనేజిక్స్, కల్చరల్ ఇంటర్‌కాలేజియేట్ స్పోర్ట్స్ ఫెస్ట్

నరసరావుపేట టౌన్, జనవరి 24 నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ లో ప్రతిష్టాత్మక వార్షిక వేడుక "జూబిలేషన్ 2కె26" నేషనల్ లెవల్ టెక్నో, మేనేజిక్స్, కల్చరల్ ఇంటర్‌కాలేజియేట్ స్పోర్ట్స్ ఫెస్ట్ ను ఘనంగా నినిర్వహించామని కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలియజేశారు. విద్యార్థుల సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, క్రీడా ప్రతిభ మరియు సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీసే లక్ష్యంతో ఈ ఉత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో వివిధకళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు టెక్నికల్ ఈవెంట్స్, మేనేజిక్స్ పోటీలు, ఇంటర్ కాలేజియేట్ క్రీడా పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటీ టి శ్రీలీల కళాశాలకు విచ్చేసి విద్యార్థులతో స్నేహపూర్వకంగామమేకమయ్యారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, విద్యా ప్రతిభలో అత్యుత్తమ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రముఖ గాయని సమీరా భరద్వాజ్ తన బృందంతో కలిసి నిర్వహించిన లైవ్ కాన్సర్తో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆమెతో పాటుగాయకుడుమద్దూరి హేమంత్ చేసిన హాస్యభరితమైన, ఉత్సాహభరితమైన ప్రదర్శనలు విద్యార్థుల్లో అపూర్వ ఆనందాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం తరఫున చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి , సెక్రటరీ రమేష్ బాబు ముఖ్యంగా అభినందనలకు పాత్రులయ్యారు. వినిది గ్రూప్ ఆఫ్ కాలేజెస్కు చెందిన ప్రత్యేక అతిథులుమిట్టపల్లిసత్యనారాయణ, మిట్టపల్లి కిషోర్ బాబు కార్యక్రమానికి హాజరయ్యారు.





## ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల 'ప్రత్యేక స్పందన'కు 16 అర్జీలు

నరసరావుపేట, జనవరి 24 ప్రభాతవార్త ::పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు ప్రతి నెలా 4వ శనివారం జరిగే ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక స్పందన కార్యక్రమం శనివారం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు 16 మంది తమ అర్జీలను అందించి సమస్యలను తెలియజేశారు. దీనిపై స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహ సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలో వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు.



## ఏఎంరెడ్డి ఫార్మసీ విద్యార్థినికి ఉత్తమ పోస్టర్ ప్రదర్శన అవార్డు



నకరికల్లు, జనవరి 24 ప్రభాతవార్త :: చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీలలో జరిగిన "ఇన్నోవేట్ ఫార్మా2026 ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌డ్రగ్ డిస్కవరీలో ఉద్భవిస్తున్న నూతన ఆవిష్కరణలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ దేశాలు, రాష్ట్రాల నుండి వచ్చిన శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలు, పోస్టర్ ప్రదర్శనల ద్వారా నూతన ఆలోచనలు పంచుకున్నారు. సదస్సులో నరసరావుపేట మండలం లోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థిని జెవిఎన్ సౌమ్య దేవి ప్రదర్శించిన పరిశోధనాత్మక పోస్టర్ ప్రదర్శనకు ఉత్తమ పోస్టర్ ప్రెజెంటేషన్ అవార్డు దక్కింది. ఆమె ప్రదర్శించిన పరిశోధన అంశం ఫార్మాస్యూటికల్ రంగంలో నూతన ఆవిష్కరణలకు దోహదపడేలా ఉందని నిర్వాహకులు ప్రశంసించారు కళాశాల సెక్రటరీ డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి విద్యార్థినిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ భూషణరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఏ.పావని, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## పల్నాడు జిల్లా భాజపా ప్రధాన కార్యదర్శిగా ఆదిత్య

రొంపిచర్ల, జనవరి 24 ప్రభాతవార్త ::భారతీయ జనతాపార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేటకు చెందిన జన్నాభట్ల ఆదిత్యను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ వివరాలు తెలిపారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను శిరసావహిస్తూ భారతీయ జనతాపార్టీని జిల్లాలో బలంగా ముందుకు తీసుకు వెళ్ళటానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తానని ఆదిత్యతెలిపారు. బిజెపి పార్టీ నాయకులు ఆదిత్య కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



నరసరావుపేట, జనవరి24 ప్రభాత వార్త ::బాలికల విద్యకు రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని జాయింట్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. ఐసిడిఎస్ పిడి కె.ఉమారాణి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవానికి జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యావంతులైన ఆడ పిల్లలు పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని రంగాలలో ప్రావీణ్యత సాధిస్తున్నారని ఆమె అన్నారు. విద్య వల్ల మనోధైర్యం వస్తుందని అప్పుడు అనుకున్న లక్ష్యాలను సాధించచ్చన్నారు. ఐసిడిఎస్ పిడి కె.ఉమారాణి మాట్లాడుతూ బాలికలు ఉత్తమ విలువలతో కూడిన జీవనం సాగిస్తూ తల్లిదండ్రుల మాట గౌరవించాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు నమ్మకంతో ఉండాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భం దాల్చడం వలన కలిగే అనర్థాలపై మాట్లాడారు. జిసిడిఓ డి.రేవతి , జిల్లా సోషల్ వెల్ఫేర్ ,సిడిపివోలు, నోడల్ ఆఫీసర్, ఈవో,సూపర్వైజర్లు డీసీపీ యూనిట్ సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, శిశు గృహ,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రావిపాడులో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం

నరసరావుపేట టౌన్, జనవరి 24 ప్రభాతవార్త :: మండలంలోని రావిపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి ఆధ్వర్యంలో సభను నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. డిపిఓ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో నాగానంద్, ఏటీఎం భరత్, ఎమ్మార్సీ అయ్యప్ప రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, మహేశ్వరి, శ్రీలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూట మి ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచేందుకు కృషి చేస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన పల్లె సీమలను తయారు చేసేందుకు ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంటూ వ్యాధులను పారద్రోలాలని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి పిలుపునిచ్చారు.



## అటవీ శాఖ అడ్డంకులతో ఎండిపోతున్న మామిడి తోటలు
## ఎండిపోయిన మొక్కలతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

అచ్చంపేట, జనవరి 24, ప్రభాతవార్త: ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూముల్లో చట్టబద్ధంగా సాగు చేస్తున్నప్పటికీ, మామిడి మొక్కలకు కనీసం నీరు పెట్టనివ్వకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటుండటంతో అచ్చంపేట మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన అసైన్డ్ భూముల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారుల వైఖరితో తమ కళ్లముందే పంటలు నశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం అచ్చంపేట తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఎండిపోయిన మామిడి మొక్కలతో నిరసన చేపట్టారు. ఈ నిరసనకు పల్నాడు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి. రవిబాబు, కౌలు రైతు సంఘం నాయకులు వి. హనుమంతరావు, ఆర్. వెంకటేశ్వర్లు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా భూముల హద్దుల పేరుతో అటవీ శాఖ అధికారులు అటవీ భూములని అభ్యంతరాలు పెడుతూ రైతులను సాగుకు రానివ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. 1993 సంవత్సరంలో తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 321 నుంచి 337 వరకు సుమారు వంద మంది నిరుపేద రైతులకు ప్రభుత్వం అసైన్డ్ భూములు పంపిణీ చేసిందని తెలిపారు. అయితే తాజాగా అందులోని 16 మంది రైతుల భూములు అటవీ శాఖ పరిధిలో ఉన్నాయంటూ అటవీ శాఖ అధికారులు ఆరోపణలు చేస్తూ సాగును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు, జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా హద్దులు నిర్ణయించినప్పటికీ అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. నీరు పెట్టనివ్వకపోవడంతో పొలాల్లో నాటిన మామిడి మొక్కలు పూర్తిగా ఎండిపోతున్నాయని, దీని వల్ల తాము తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాసిల్దార్ అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారంపై ఎలాంటి స్పష్టమైన చర్యలు లేకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే అటవీ శాఖ అడ్డంకులు తొలగించి రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో కత్తుల గోపికృష్ణారెడ్డి, కత్తుల నాగసంధ్య, సుంకర భానుప్రసాద్, సుంకర లాలమ్మ, కొంపెర్ల స్వామి, కొంపెర్ల సూర్యకళ తదితర రైతులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## మొక్కలు నాటుదాం.. భవిష్యత్తుకి భద్రత కల్పిద్దాం



**కర్లపాలెం,జనవరి24,ప్రభాతవార్త:** మొక్కలు నాటండి భవిష్యత్తుకి భద్రత కల్పిద్దాం అని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై విద్యార్థిని విద్యార్థులకు పుర ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే పరిసరాలును పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి , మండల విద్యాశాఖ అధికారి ఎన్ విజయ శ్రీ, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి విజయశ్రీ, హెల్త్ సిబ్బంది,, ఉపాధ్యాయులు ఇన కొల్లు పోలీసు రావు, వీర జ్యోతి, సుబ్బారెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## తీరప్రాంత ప్రయాణీకుల కోరకు రైళ్ళ సౌకర్యాన్ని మెరుగుపర్చాలి



రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:భట్టిప్రోలు మండలంలోని పల్లెకోన వరకు సిఆర్‌డిఎ పరిధి విస్తరణ కారణంగా రాష్ట్ర రాజధాని అమరావతిలోని సెక్రటేరియట్ వద్దకు వెళ్ళి వచ్చేందుకు రేపల్లె-తెనాలి బ్రాంచ్ రైలు మార్గంలో తీర ప్రాంత ప్రయాణీకుల కోసం రైళ్ళ సౌకర్యాలను పూర్తిస్థాయిలో పెంచాలని రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి చావలి విజయ మోహనరావు కోరారు.రేపల్లె-తెనాలి బ్రాంచ్ రైలు మార్గంలో రెండో ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ అంశాలను దక్షిణ మధ్య రైల్వేశాఖ ఉన్నతాధికారులు,బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళారు.అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద రేపల్లె రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు నిర్మాణ దశలోనే ఉనాన్నయన్నారు.దూర ప్రాంతాలకు వెళ్ళే రైళ్ళ సమయాలను ప్రయాణీకులకు అనుకూలంగా మార్పు చేయాలని ఆయన సూచించారు.17626 డెల్టా ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ ఉదయం 5.30 గంటలకు లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.12748 పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు లింకు ట్రైన్‌గా 67235 నెంబరుతో నడిచే గుంటూరు-తెనాలి ప్యాసింజర్ రైలును నడపాలన్నారు. మార్కాపూర్ రోడ్- తెనాలి(67239) ప్యాసింజర్ రైలుకు లింక్ ట్రైన్‌గా తెనాలి-రేపల్లె(67231) ప్యాసింజరు రైలును నడపాలన్నారు. విజయవాడ-తెనాలి-రేపల్లె- విజయవాడ మధ్య 67213,67214,67221,67222 నెంబర్లతో రాకపోకలు సాగించే రైళ్ళను నడపాలని ఆయన సూచించారు.ప్రతి రోజూ సాయంత్రం 6.45 గంటలకు విజయవాడ -తెనాలి-రేపల్లె- విజయవాడ మధ్య అదనపు రైలు ఏర్పాటు చేస్తే బాపట్ల,కృష్ణా,గుంటూరు జిల్లాల ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంటుందని మోహనరావు పేర్కొన్నారు.17645 ఎక్స్‌ప్రెస్ రైలు గతంలో మాదిరిగా గుంటూరులో సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరి తెనాలి రైల్వే స్టేషన్‌కు సాయంత్రం 6.43 గంటలకు చేరుకుని రాత్రి 8.15 గంటలకు రేపల్లె రైల్వే స్టేషన్‌కు చేరే విధంగా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అదే విధంగా రేపల్లె రైల్వే స్టేషన్‌లో ఫిట్ లైన్ సౌకర్యం అమలులోకి తెస్తే రైళ్ళ సంఖ్య పెంచుకునేందుకు వీలేర్పడుతుందని చావలి విజయ మోహనరావుఅభిప్రాయపడ్డారు. మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటు చేస్తే ప్రయాణీకులకు మేలు జరుగుతుందన్నారు. దక్షిణ మధ్య రైల్వేశాఖకు ఆదాయం పెరుగుతుందని ఆయన వెల్లడించారు.రేపల్లె-తెనాలి బ్రాంచ్ రైలు మార్గంలోని రైల్వే స్టేషన్లలో ప్రయాణీకుల వాహనాలను నిలుపుకుని తిరిగి తీసుకువెళ్ళే విధంగా స్టాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే రైల్వేకు ఆదాయం పెరుగుతుందని ఆయన తెలియజేశారు.అలాగే బ్రాంచ్ రైలు మార్గంలోని రైల్వే స్టేషన్లు పరిశుభ్రంగా ఉండేలా, టాయిలెట్స్,మంచినీటి సౌకర్యం కల్పించాలని విజయ మోహనరావు విజ్ఞప్తి చేశారు.

## బాల్యవివాహాలు పూర్తిగా అరికట్టడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

**బాపట్ల,జనవరి24,ప్రభాతవార్త:** బాల్యవివాహాలు పూర్తిగా అరికట్టడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. మహిళ శిశు సంక్షేమ శాఖ, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బాల్య వివాహాల విముక్తి రధాన్ని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. నేను భారతదేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతానంటూ రథంపై జిల్లా కలెక్టర్ తొలి సంతకం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాల రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలన్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో ఈ రథం 20 రోజులు పర్యటించనుందన్నారు. గ్రామాలలో పర్యటిస్తూ బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికలను శక్తిమంతులను చేద్దాం, బాల్య వివాహాలు అరికడదాం బాలికలను రక్షిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, మహిళ శిశు సంక్షేమ శాఖ



పిడి రాధా మాధవి, డి సి పి ఓ పురుషోత్తం, పిఓ కృష్ణ, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ డైరెక్టర్ కిషోర్, కోఆర్డినేటర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు విద్య ఆరోగ్యం సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**వేమూరు జనవరి 24 (ప్రభాతవార్త) :** బాలికలు విద్య, ఆరోగ్యం సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలియజేశారు. శనివారం జాతీయ బాలిక



దినోత్సవం పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2008నుండి జాతీయ బాలిక దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. బాలికల పట్ల లింగ వివక్షత లేకుండా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజిని, అమల, రాజకుమారి, దనమని, రెబ్బమ్మ, లక్ష్మీ, మాధవి, మస్తాన్‌బి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**వేమూరు జనవరి 24 (ప్రభాతవార్త) :** ప్రతి కుటుంబం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రవికుమార్ తెలియజేశారు. శనివారం స్వర్ణాంధ్ర ఉండాలని అదే విధంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే రీతిలో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పాఠశాల విద్యార్థులతో



స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పరిశుద్ధ కార్యక్రమాలపై గ్రామ పంచాయితీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దానితో పాటు ప్రతి కుటుంబం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవీంద్రకుమార్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ ఎంపీడీవోలు కోటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, ఏపీఎం శోభన్, ఏపీవో సత్యకృష్ణ, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## శాసనసభ్యులు నరేంద్ర వర్మకు కృతజ్ఞతలు తెలిపిన సంగుపాలెం రైతులు

**పిట్టలవానిపాలెం,జనవరి24,ప్రభాతవార్త:** మండల పరదిలోని సంగుపాలెం లో ప్రధాన రహదారి మరమ్మతులు చేస్తూండగా పంటకాలవ పూడికతో నిండిపోయి తూర్పు వైపు పొలములు నీటితో మునిగిపోవడం జరిగిందని అని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కు తెలుపగా అయన సూచనలు ప్రకారం రహదారులు



మరియు భవనముల విభాగం బాపట్ల డివిజనల్ ఇంజనీర్ ఆదేశాలతో శనివారం నాడు కాలువ పూడిక తీసి మరమ్మతులు చేయడం జరిగింది.దీంతో నీరు పారుదల చేయటంతో రైతులు పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా తప్పిపోవడంతో ఆ రైతులందరూ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదములు తెలిపారు. అందుకు సహకరించిన బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి డాక్టర్ సొపాటి గ్లోరి యూనెట్ కు, డివిజనల్ ఇంజనీర్ కు రైతులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపి,హర్షం వ్యక్తం చేశారు.

## ఆడ,మగ లింగవివక్ష తగదు

**నిజాంపట్నం, జనవరి 24, ప్రభాతవార్త:** ఆడ, మగ అనే లింగ వివక్ష లేకుండా బాలికలను చదవించాలని పల్లపట్ల సిడిపిఒ అనసూయ అన్నారు. శనివారం మండలం లోని వివిధ జడ్పి ఉన్నత పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో బాలికా దినోత్స వాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను



అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుకునేలా చూడాలని, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఆడపిల్లలకు చిన్నవయస్సులో వివాహాలు చేయరాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల లో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు, ఈసిసి డేలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల పట్టణంలో ఘనంగా జరిగిన డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమం

**బాపట్ల,జనవరి24,ప్రభాతవార్త:** దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి డ్రగ్స్ ను ముట్టుకోరు అనే కీ క్యాంపెయిన్ రాష్ట్రం అంతట ఈగల్ వ్యవస్థ చేపడుతుందని ఏపీ ఈగల్ చీఫ్ఐజిపి అకే.రవికృష్ణ తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో శనివారం డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ



ఉమామహేశ్వర్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ,బాపట్ల ఈగల్ ఎస్పీ మహేశ్వరరాజు పాల్గొన్నారు. బాపట్ల టౌన్ అంబేద్కర్ సెంటర్ నుండి 1000 మంది విద్యార్థులతో వాకథాన్ నిర్వహించగా బాపట్ల ఎస్పీబి.ఉమామహేశ్వర్ జెండా ఊపి ప్రారంభించగా ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ వకు సాగింది.తదుపరి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ఐజి అకే.రవికృష్ణ మాట్లాడుతూ దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి డ్రగ్స్ ను ముట్టుకోరు అనే కీ క్యాంపెయిన్ రాష్ట్రం అంతట ఈగల్ వ్యవస్థ చేపడుతుందన్నారు. గతం లో డ్రగ్స్ కేసులో పట్టుబడి శిక్ష అనుభవిస్తున్న విద్యార్థుల గురించి వివరిస్తూ విజయవాడలో జరిగిన ఒక కేసులో బీటెక్ చదువుతున్న ఒక అబ్బాయి, అమ్మాయి సింథటిక్ డ్రగ్స్‌తో పట్టుబడ్డారన్నారు. అప్పుడు ఆ అబ్బాయి ఒక ప్రశ్న అడిగాడు -మేము మా సొంత డబ్బులతో ఒక గ్రాము డ్రగ్ కొనుక్కున్నాం. అందులో తప్పేంటి?" అని.అప్పుడే వారికి అర్థమయ్యేలా చెప్పాం - ఒక గ్రాము డ్రగ్ కోసం ఇచ్చే డబ్బుతో పాకిస్తాన్ లాంటి దేశాల్లో ఉగ్రవాదానికి ఆయుధాలు కొనుగోలు చేయబడుతున్నాయి. ఒక ఏకే-47 బుల్లెట్ విలువ సుమారు 200 రూపాయలు. అంటే ఒక గ్రాము డ్రగ్ డబ్బుతో ఎన్నో బుల్లెట్లు వస్తాయి. మీరు డ్రగ్స్ వాడటం అంటే కేవలం మీ ఆరోగ్యాన్ని కాదు - దేశ భద్రతను కూడా ప్రమాదంలోకి నెట్టడమే అని తెలపామన్నారు.పాకిస్తాన్ లాంటి దేశాలు భారత్ లోని యువతి యువకులను లక్ష్యంగా పెట్టుకొని వివిధ మార్గాల ద్వారా హెరాయిన్, మెర్త్ వంటి డ్రగ్స్ ను భారత్ లోకి సరఫరా చేస్తూ సంపాదించిన డబ్బుతో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్ లోని యువతను బలహీన పరిచే దిశగా చేసి దేశాన్ని బలహీనపరిచి ఉగ్ర కుట్రలకు తెరలేపుతున్నారు. కనుక యువత అప్రమత్తంగా ఉండి అట్టి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి దేశ భద్రతకు ముప్పు వాటిల్లకుండా డ్రగ్స్ పై సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి సమాచారం ఇవ్వాలని కోరారు.ప్రతి తల్లి తండ్రి ఒకటే కోరుకుంటారు - పిల్లలు చదువుకోవాలి, మంచి స్థాయికి రావాలి. ఆ ఆకాంక్షలను ఎట్టి పరిస్థితుల్లో మర్చిపోవద్దు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆపరేషన్ చైతన్యం, సేఫ్ క్యాంపస్ వంటి కార్యక్రమాల ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు



తీసుకుంటోందన్నారు. చెక్‌పోస్టులు, సర్వేలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీఉమామహేశ్వర్ మాట్లాడుతూ డ్రగ్స్ మరియు గంజాయి నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ఈగల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రవేశపెట్టిందన్నారు..

బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారు సైంటిస్టులు, డాక్టర్లు, న్యాయమూర్తులు, లాయర్లు, ఐపీఎస్ అధికారులు, వ్యాపారవేత్తలుగా ఎదగాలని ప్రతి తల్లిదండ్రులు, గురువులు ఆకాంక్షిస్తారన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే బాధ్యత యువతదేనన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం మాత్రమే కాకుండా జాతీయ భద్రత, సంస్కృతి మరియు సంప్రదాయాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల స్నేహితుల మధ్య తేడా తెలియకపోవడం, వ్యక్తిగతంగా మరియు కుటుంబపరంగా నష్టాలు, రోడ్డు ప్రమాదాలు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు.డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదాన్ని యువత హృదయాల్లోకి తీసుకెళ్లిన గౌరవ ఐటి శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ బాబు గారి ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని డ్రగ్స్ వినియోగిస్తున్న వారిపై సమాచారం ఉంటే గోప్యంగా పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం వంటి నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. చివరిగా ఈగల్ ఎస్పీ మహేశ్వర రాజు విద్యార్థులతో డ్రగ్స్ వద్దు బ్రో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమము లో బాపట్ల ఏఎస్పీ గోగినేని రామాంజనేయులు.టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ జనసేన కన్వీనర్ శివనారాయణ, రమేష్ హాస్పిటల్ తరుపు హెచ్ ఆర్ భారత్, ఫౌండర్ సమంత, కోఆర్డినేటర్ నరేష్ మరియు ఈగల్ సెల్ సభ్యులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనకు నిదర్శనం స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర

**పిట్టలవానిపాలెం,జనవరి24,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం వాహనాన్ని బాపట్ల నియోజకవర్గం



పిట్టలవానిపాలెం మండల కేంద్రంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూసుపరిపాలనకు నిదర్శనం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లక్ష్యసాధనకు మార్గం చెత్త నుంచి సంపద సృష్టించడం అన్నారు. ఇంట్లో ఉన్న వ్యర్థాలు ఇస్తే, ఉపయోగపడే వస్తువులు ఇస్తున్న స్వచ్ఛ రథం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటికి ప్రతిగా నిత్యవసర సరుకులను అందించే స్వచ్ఛ రథం పథకాన్ని ప్రారంభించామన్నారు. ప్రజల నుంచి సేకరించిన వ్యర్థలకు ప్రతిగా కొబ్బరి నూనె,సర్ఫ్,షాంపూలు,నూనె,గోధుమ పిండి,మినపప్పు,వంటి 12 రకాల సరుకులను కూటమి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కేజీ పాత ఇనుము రూ 20,పేపర్లు రూ 15,పుస్తకాలు రూ 10, అట్టపెట్టలు ప్లాస్టిక్ సీసాలు రూ20,స్టీలు వస్తువులు రూ 20, అల్యూమినియం రూ 120,గాజు సీసా రూ 2 చొప్పున కొనుగోలు చేసి వస్తూ మార్పిడి విధానం కావాలని కోరుకునే వారికి కొబ్బరి నూనె,సబ్బులు,ఉల్లిపాయలు, కందిపప్పు,గోధుమ పిండి,ఇలా పలు రకాల నిత్యవసర సరుకులు అందిస్తారన్నారన్నారు.

## ఆరోగ్య పరరక్షణ పై విద్యార్థులకు అవగాహన

**రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని రేపల్లె రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ య్య అన్నారు.శనివారం పట్టణంలోని అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బహిరంగ మలమూత్ర విసర్జన నివారణపై అవగాహన కార్యక్రమంతో పాటు వైద్య ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు.విద్యార్థులు,సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.విజ్ఞాన్ నర్సింగ్ కళాశాల,రేపల్లె పారా మెడికల్ బృందం వైద్య సేవలు అందించింది.ఎన్ఎస్ఎస్ యూనిట్,ఎన్‌సిసి యూనిట్,రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ చలపతి,ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్ర కుమార్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు,ఎన్‌సిసి ఎఎన్ఓ కె.బాలగురవయ్య,రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి

రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:పట్టణంలోని ప్రభుత్వ బి.సి సంక్షేమ బాలికల వసతిగృహాన్ని శనివారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ డైరెక్టర్,సాధికారత అధికారిణి శివలీల బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌తో కలసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించేందుకు పట్టుదల, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ప్రతి విద్యార్థినికి లక్ష్యసాధనలో ముందుకు సాగాలని ఆమె సూచించారు.విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నదని చెప్పారు.ఈ కార్యక్రమంలో వార్డెన్ అనిత, అసిస్టెంట్ బిసి సంక్షేమ శాఖ అధికారి శివనాగేశ్వర్,రేపల్లె మండల తహశీల్దార్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణే ప్రభుత్వ ధ్యేయం

**నగరం,జనవరి24,ప్రభాతవార్త:** ప్రజల రక్షణే ప్రభుత్వ ధ్యేయమని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ మార్టురి శ్రీరామ్ ప్రసాద్ అన్నారు.శనివారం స్థానిక మండల పరిధిలోని అలపర్రు పంచాయితీ కట్టవ గ్రామంలో అప్పర్ ప్రైమరి పాఠశాలలో డ్రగ్స్,ఆల్కహాల్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు,అక్రమ రవాణా,దుర్వినియోగం ,వాటి వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. మాదకద్రవ్యాలు అమ మ్మకం,కొనుగోలు, రవాణా సమాచారం అందిన ఎడలా కంట్రోల్



రూమ్ 14405 ,9490455599 నెంబర్లకు తెలియపరచాలన్నారు. వివరాలు తెలిపిన వారి పేర్లు గోప్యగం ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యయులు రహముతుల్లా బేగ్,పోలీస్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు పెట్టుబడి తగ్గించి ఆదాయం పెంచుకోవాలి

**నగరం,జనవరి 24,ప్రభాతవార్త:** ప్రతి రైతు పెట్టుబడి తగ్గించి ఆదాయం పెంచే మార్గాలను ఆచరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎమ్.విజయనిర్మల అన్నారు. శనివారం నగరం



గ్రామ రైతుసేవా కేంద్రంలో పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఏపిఎయిమ్స్ మొబైల్ అప్లికేషన్ రాష్ట్రా ప్రభుత్వం తీసుకువచ్చిందని ,దీని వలన పొలాల వివరాలు,వ్యవసాయ సూచనలు ,చీడపీడల సమాచారం,మార్కెట్ ధరలు,పంట నష్టం జరిగితే ధరఖాస్తు ప్రక్రియ వంటి సేవలు అందిస్తుందని తెలిపారు. మొక్కజొన్న,వేరుశెనగ పంటల విస్తీర్ణం సుమారు 15వేల 300ఎకరాలు సాగు చేయటం జరుగుతుందని ,9వేల ఎకరాలు మాత్రమే ఈ పంట నమోదు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లే వ్యవసాయ సంచాలకులు ఏ.లక్ష్మీ,మండల వ్యవసాయ అధికారి వి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీకుతో అగ్ని ప్రమాదం



నగరం,జనవరి 24,ప్రభాతవార్త: గ్యాస్‌లీకుతో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన స్థానిక మండల పరిధిలోని చినమట్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే సేద అబ్దుల్ బుడ నివాసం ఉంటున్న ఇంటిలో ప్రమాదవశాత్తు గ్యాస్‌లీక్ అవడంతో అగ్ని ప్రమాదం జరిగి ఇంటిలో ఉన్న వస్తువులు,బట్టలు మొత్తం పూర్తిగా కాలిపోవడం జరిగింది .ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు సుమారు 5లక్షలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం నిరాశ్రులైన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు.

## విద్యార్థినీ,విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

**చెరుకుపల్లి, జనవరి 24, ప్రభాతవార్త :** విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించడం ద్వారా అనతి కాలంలో ఉన్నత



శిఖరాలకు చేరుకోగలుగుతారని చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే లక్ష్మీనారాయణ అన్నారు. పాఠశాల నుండి అండర్ 17 కుందుళ్ళ పోటీ విభాగంలో ఎంపిక కాబడి జాతీయస్థాయిలో ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు మహారాష్ట్ర షిరిడీలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని, విద్యార్థి ఎం తపస్వి ,పి లీల మోహన్ కృష్ణ లను ఆయన అభినందించారు. అదేవిధంగా అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించిన ఎం యోగ వర్షిత, టీ రాహుల్ను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వీరిని దుశ్శాలు వాళ్లతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు పి లాజర్ టి నవీన్లు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభకు కృషిచేసిన పాఠశాల క్రీడా ఉపాధ్యా యుడు కాటూరి శ్రీనివాసరావు అభినందిస్తూ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భావి భారత పౌరులుగా ఎదగ గలుగుతారని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ టి శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది , అధ్యాపకేతర సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## సమాజం పట్ల విద్యార్థినీలు అవగాహన కలిగి ఉండాలి

**చెరుకుపల్లి, జనవరి 24, ప్రభాతవార్త :** నేటి సమాజంలో బాలికలు అవగాహనతో విద్య నేర్చుకుంటూ , సత్ప్రవర్తనతో నడుచుకోవాలని



అంగన్వాడి సూపర్వైజర్ డి స్వరూపారాణి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలకు పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, వనజాక్షిలు అధ్యక్షత వహించారు. విద్యార్థినిలు చదువు పట్ల, సమాజంలో పరిస్థితులు పట్ల తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలని వారు సూచించారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని చదువుకు ఉపయోగకరంగా వినియోగించుకోవాలని అనవసర ,అనర్థాలకు దారి తీసే విధంగా వాటిని ఉపయోగించరాదని హెచ్ఎం విద్యార్థినులకు సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాల పట్ల జరిగే అనర్థాల పై అవగాహన కలిగి ఉండాలని సంబంధిత పలు సూచనలను అంగన్వాడి సూపర్వైజర్ విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలపై విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు వనజాక్షి ,గాయత్రి, రామ్మోహన్ రావు, రాధాకృష్ణ అంగనవాడి టీచర్లు శిరీష, వెంకటేశ్వరమ్మ, చైతన్య, ధానమ్మ ,నాగలక్ష్మి, నాగమణి ,సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పశు వైద్య శిబిరాలను పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలి

**చెరుకుపల్లి ,జనవరి 24, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఉచిత పశువైద్య శిబిరాలు ద్వారా అందిస్తున్న సేవలను పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని గూడవల్లి పశువైద్యశాల అధికారిని బి జ్యోత్స్న అన్నారు. శనివారం మండలంలోని కనగాల గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య నిర్వహించారు. శిబిరం ద్వారా నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. గొర్రెలకు, మేకలకు టీకాలు వేయించారు . ఉచితంగా కృత్రిమ గర్భ ధార ఇంజక్షన్లు చేయించారు. పశువులకు కాలానికి అనుగుణంగా వచ్చే వ్యాధులను వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు ఆమె వివరించారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఇటువంటి పశు వైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక నాయకులు ఉయ్యూరు వెంకట శివ రామకృష్ణ అన్నారు. శిబిరంలో చైతన్య శంకర్ ,పశువైద్య సిబ్బంది, రైతులు, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్‌లో ఘనంగా ముగిసిన ఏపి స్పేస్ టెక్ సమ్మిట్-2026

పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త: అంతరిక్షం ఎత విస్తారమో, అందులో ఉన్న అవకాశాలూ అంతే విస్తారమని ఏఐఎంఎస్‌సీఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటరామన్ అన్నారు. అవకాశాలు ఎక్కువగా ఉన్న చోట ప్రమాదాలు కూడా ఎక్కువే. కానీ అలాంటి రంగాల్లోనే భవిష్యత్ దాగి ఉంటుందని



అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంరిక్ష సాంకేతిక రంగంలో గ్లోబల్ హబ్‌గా ఎదగడమే లక్ష్యంగా గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలంల, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ, అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్-2026 శనివారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటరామన్ మాట్లాడుతూ స్పేస్ టెక్ సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులు అంతరిక్ష సాంకేతికతపై ఎంతో నేర్చుకున్నారన్నారు. ఉపగ్రహాల కోసం పోస్ట్-క్వాంటం ప్రోగ్రామింగ్ అల్గోరిథమ్‌లను అభివృద్ధి చేసి, ఉపగ్రహాల నుంచి భూమికి వచ్చే డేటా అత్యంత భద్రతతో ప్రసారం అయ్యే విధంగా వ్యవస్థలను రూపొందించవచ్చునని వివరించారు. భూమి పరిశీలన సెన్సార్‌ల అవసరాలు, రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీలో వచ్చిన మార్పులు, డేటా ఇంటిగ్రేషన్-డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల నిర్మాణం వంటి అంశాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు.

**యువతకు కొత్త దిశగా క్వాంటమ్ అమరావతి వ్యాలీ: సీవీ శ్రీధర్**

క్వాంటమ్ అమరావతి వ్యాలీ అనే ప్రతిష్టాత్మక భావనతో ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ టెక్నాలజీలో అగ్రగామిగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర లక్ష్యమని ఏపి క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ హెడ్ సీవీ శ్రీధర్ అన్నారు. ఏసి స్పేస్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ప్రపంచాన్ని నిర్ణయించబోయే రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ కీలకమన్నారు. ఈ రంగంలో యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. క్వాంటమ్ అమరావతి వ్యాలీ ద్వారా పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల మధ్య సమన్వయం పెంచి ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని తెలిపారు. చివరగా ఈతరం యువతే భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తును నిర్మించబోతుందన్నారు. ఆసక్తి, అవగాహన, సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర అభ్యాసం, ధైర్యం ఇవే మీ విజయానికి మూలాధారాలు అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

**అంతరిక్ష పరిశోధనలే ఆధునిక జీవనానికి ఆధారం: డాక్టర్ లావు రత్తయ్య**

నేడు అంతరిక్ష పరిశోధనలు లేని ఆధునిక జీవితాన్ని ఊహించలేము. నచేతిలోని సెల్‌ఫోన్ నుండి టీవీ ప్రసారాల వరకు , ఆరోగ్య రంగంనుండి వ్యవసాయం వరకు ప్రతిదీ స్పేస్ టెక్నాలజీతో ముడిపడి ఉందని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యఅన్నారు. కేవలం సిద్ధాంత పరమైన పరిజ్ఞానమే కాకుండా, శాస్త్రవేత్తలు తరచుగా వర్సిటీని సందర్శించి విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించాలని ఆయన కోరారు. విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా స్కిల్స్ నేర్చుకోవాలని, అందుకు శాస్త్రవేత్తల సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు.

**35-40బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవాలి: పార్లమెంట్ సభ్యులు**

ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ దాదాపు 500బిలియన్ డాలర్ల స్థాయిలో ఉందని, అందులో అమెరికా 200బిలియన్, చైనా 70బిలియన్ డాలర్ల వాటా సాధిస్తుండగా, భారత్ మాత్రం 7-8బిలియన్ డాలర్ల వద్దే ఉందని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఇంత ప్రతిభ, ఇంత జనాభా, ఇంతమంది శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఉన్న దేశానికి ఇది చాలా తక్కువని, వచ్చే 5-6ఏళ్ళలో భారత్ కనీసం 35-40బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. విద్యార్థులు, పరిశోధకులు 3నుంచి 6నెలల పాటు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేసి అనుభవం సంపాదించాలని పిలుపునిచ్చారు. ఇకపై అకాడమీ, పరిశ్రమ కలయిక మరింత బలపడాలి. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారత అంతరిక్ష రంగాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్ళాలి అంటూ ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు, డాక్టర్ వి.శేషగిరిరావు, సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వర్సిటీ ఇంచార్జి వీసి కెవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డీవీసి హాస్పటల్‌లో న్యూర్యాలజీ విభాగం ప్రారంభం

**పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా వడ్లమూడిలోని డీవీసి ఆసుపత్రిలో ఆధునిక న్యూరాలజీ విభాగాన్ని రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించారు. న్యూరాలజీ వైద్య సేవలతోపాటు ఆధునిక ఎమ్మారై స్కానింగ్ యంత్రాలను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థికశాఖామంత్రి పయ్యావుల్ కేశవ్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేయడం, రాష్ట్ర ప్రయోజనాల కోసం కట్టుబడి ఉండడం వల్లే నరేంద్ర ఈ స్థాయికి వచ్చారన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమన్నారు. గత ప్రభుత్వం నరేంద్రపై కేసులు పెట్టి అరెస్టు చేసిందన్నారు. కానీ ఒక్క తప్పు కూడా నిరూపించలేకపోయిందన్నారు. కేసులు వేసినవారే కోర్టుల్లో అభాసుపాలయ్యారన్నారు. అరెస్టు సమయంలో కూడా నరేంద్రకుమార్ సంగం డెయిరీ గురించే ఆలోచించారని చెప్పారు. డెయిరీని కాపాడాలని మమ్మల్ని కోరారన్నారు. స్వర్గీయ వీరయ్య చౌదరి, ఎమ్మెల్యే నరే ంద్రకుమార్ చేసిన మంచి పనులే నరేంద్రను కాపాడాయన్నారు. సంగం డెయిరీని రూ.200కోట్ల స్థాయి నుంచి రూ.2వేల కోట్ల స్థాయికి తీసుకెళ్ళిన ఘనత నరేంద్రకుమార్‌కే దక్కుతుందన్నారు. వేలాదిమంది రైతుల



జీవితాల్లో వెలుగులు నింపే శక్తి సంగం డెయిరీకి ఉందన్నారు. దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ఎన్నో విమర్శలు వచ్చినా చిత్తశుద్ధి, సంకల్పబలం ఉన్నవారు నిలబడతారన్నారు. రైతుల పట్ల ప్రేమ వీరయ్య చౌదరిలో స్పష్టంగా కనిపించేదన్నారు. ఆయనతో నాకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. త్వరలో క్యాన్సర్ వంటి జబ్బులకు కూడా చికిత్స అందించాలనే ఆలోచనలో ఉన్నాట్లు చెప్పారు. కార్యక్రమంలో నన్నపనేని రాజకుమారి,డీవిసి హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది, సంగం డెయిరీ డైరెక్టర్లు, పాడి రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ సీమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త: గ్రామ సీమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో



శనివారం స్వచ్ఛ రథాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్, ఇతర పనికి రాని వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుందన్నారు. పనికిరాని సామాన్లను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా స్వచ్ఛ రథాలకు అందజేస్తే, స్వచ్ఛ రథాల నిర్వాహకులు గ్రామాల్లోని ప్రజల వద్ద ఉన్న పాత సామాన్లు కొనుగోలు చేసి, అందుకు తగ్గట్లుగా వారికి అవసరమైన నిత్యావసరాలను అందజేస్తారన్నారు. అంటే ఇది ఒక రకంగా వస్తుమార్పిడి అని చెప్పవచ్చన్నారు. నియోజకవర్గంలో పొన్నూరు, పెదకాకాని మండలాలకు ఈ స్వచ్ఛ రథాలు మంజూరు అయ్యాయని, వాటిని ఈ రోజు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా నియోజకవర్గానికి ఇ-ఆటోలు రెండు మంజూరు అయ్యాయన్నారు. వాటిని పొన్నూరు మండలంలోని బ్రాహ్మణకోడూరుకు ఒకటి, చేబ్రోలు మండలంలోని శేకూరు గ్రామానికి ఒకటి అందజేయడం జరిగిందన్నారు. ఇక ఇవి కాకుండా పొన్నూరు మండలంలోని 22గ్రామ పంచాయితీలకు పుష్‌కార్ట్లను కూడా అందజేయడం జరిగిందన్నారు. గ్రామస్తులు చెత్తా చెదారాలను రోడ్డు, కాలువల్లో పడేయకుండా పుష్‌కార్ట్లకు అందజేయాలని సూచించారు. గ్రామాలు స్వచ్ఛతగా ఉండాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి బి.సాయికుమార్, ఎంపిడిఓలు గుమ్మా చంద్రశేఖరరావు, ఆర్.శ్రీనివాసనాయక్, డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# బాలిక ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలిసర్పంచ్ శివ పార్వతి

**వట్టిచెరుకూరు, జనవరి 24, ప్రభాతవార్త :** బాలికలు ఉన్నత విద్య అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సర్పంచ్ పాతూరి శివపార్వతి, వైద్యాధికారి డాక్టర్ శివాని పేర్కొన్నారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని



శనివారంలేమల్లెపాడు గ్రామంలోని మండల పరిషత్తు అప్పర్ ప్రైమరీ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవంపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ శివపార్వతి, డాక్టర్ శివాని పాల్గొని మాట్లాడుతూ..బాలికల సంరక్షణ, హక్కులు, విద్య, పోషకాహారం, ఆరోగ్యం, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదిన జాతీయ బాలిక దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా బాలిక విద్య, ఆరోగ్య రంగాల్లో మరింత చురుకుగా ఉండేలా ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. సమాజంలో ఆడపిల్లలు మగపిల్లలు మధ్య ఎలాంటి తేడాలు లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని సూచించారు. ప్రతి అమ్మాయి ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, బాలికల విద్యకు ప్రతిఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఆడపిల్లల పోషకాహారం, ఆరోగ్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆడపిల్లలు 18 సంవత్సరాలు నిండిన తరువాతే పరిపూర్ణ శారీరక, మానసిక వికాసం సాధిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల అంతకంటే ముందే వివాహం చేయరాదని హితవు పలికారు. బాలికలను అత్యాచారాలు, ఇంట్లో వేధింపులు, అపహరణ, అక్రమ రవాణా వంటి వాటినుంచి రక్షించుకోవడం సమాజ బాధ్యత అని స్పష్టంచేశారు. మహిళలు కుటుంబంలో శారీరక, లైంగిక, మానసిక, ఆర్థిక హింసకు గురికాకుండా చూడాల్సిన అవసరం ఉందని, బాలికల పెంపకం, విద్య అన్నిరంగాల్లో సమానత్వం పాటించాలని కోరారు. నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషారాణి మాట్లాడుతూ ఒకప్పుడు ఇంట్లో ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి వచ్చిందని ఆనందించేవారని గుర్తు చేశారు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవమే లేదని, సతీ లేకపోతే సృష్టే లేదని పేర్కొంటూ ఆడపిల్లలను రక్షిద్దాం, ఆదరిద్దాం, సృష్టిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అమ్మగా, సోదరిగా, భార్యగా భవిష్యత్ తరాలకు మహిళలే ఆధారమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కస్తూరి నాగరాజు కుమారి, ఏఎన్ఎం రజనీకుమారి, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మి, పద్మజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అబ్బినేని గుంటపాలెం,రావిపాడులో విద్యార్థులకు అవగాహన సదస్సు

**పెదనందిపాడు జనవరి 24 (ప్రభాతవార్త)** పెదనందిపాడు మండలం అబ్బినేని గుంటపాలెం ఎమ్మార్ జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ లో శనివారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా, బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, మరియు రక్త హీనత కు గురికాకుండా ఉండే ఆహార పదార్థాలు గురించి, మరియు బాల్య వివాహలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఐసిడిఎస్ సిడిపిఓ .జి విజయలక్ష్మి. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి జెరీనాలు బాలికలకు వివరించారు. అనంతరం రావిపాడు మెయిన్ అంగన్వాడి కేంద్రం నందు బాల్యారంభ విద్య గురించి, ఐసిడిఎస్ సిడిపిఓ విజయలక్ష్మి తల్లులకు అవగాహన



కల్పించారు. అంతకుముందు బాలికలతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు . ఈ కార్యక్రమాలలో టీచర్ గౌతమి.ఐ టి సి ఉమామహేశ్వరి . ఎన్జీవో వి. హారిక లక్ష్మి .మహిళా పోలీసు శిరీష . ఎన్ స్వాతి. పలువురు అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి వీరయ్య చౌదరి వర్ధంతి వేడుకలు

**పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త:** మాజీ మంత్రి స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 32వ వర్ధంతి వేడుకలు మైనార్టీ నాయకుడు పఠాన్ పిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా శనివారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



కమిషనర్ ముప్పాళ్ళ మాట్లాడుతూ స్వర్గీయ మాజీ మంత్రి, క్షీర విప్లవ ప్రధాత ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవలు అందించారని, అందువల్లే ఆయన్ను ఈ ప్రాంత ప్రజలు ఈ విధంగా కొనియాడుతున్నారన్నారు. ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయన అభిమానులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. అన్ని దానముల కన్న అన్నదానమె మిన్న అని, అలాంటి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆయన అభిమానులు ముందుకు రావడం, అందులో తాను కూడా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజిసాహెబ్,మొల్లా కరీమ్, దాసరి విజయకుమార్, బండారుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి చదవడం-వ్రాయడం నేర్పించాలి

## -మండల విద్యాశాఖాధికారులు రాజు, విజయభాస్కర్

**పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి చదవడం, వ్రాయడం తప్పనిసరిగా నేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజయభాస్కర్ సూచించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ సమావే శాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాశాఖా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 75జిఎఫ్ఎల్ఎన్ యాక్షన్ ప్లాన్ సక్రమంగా అమలు అవుతుందా. .?లేదా..? అనే విషయాలను వారు



పరిశీలించారు. క్లస్టర్ సమావేశానికి ఉపాధ్యాయులందరూ హాజరవుతున్నారా..?లేదా...? రీసోర్స్ పర్సన్లు సమావేశాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా..?లేదా అనే విషయాలను వారు స్వయంగా పరిశీలించారు. ప్రతి నాల్గవ శనివారం నిర్వహించే సమావేశం వల్ల ఉపాధ్యాయులు ఏ విధంగా తర్ఫీదు పొందుతున్నారన్న విషయాలను అడిగి తెలుసుకొన్నారు. పొన్నూరు మండలంలో నాలుగు క్లస్టర్‌లలో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. చింతలపూడి జడ్పీ పాఠశాల, నిడుబ్రోలు జడ్పీ పాఠశాల, శ్రీరామా మునిసిపల్ ఉన్నత పాఠశాల, పచ్చలతాడిపర్రు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారులు ఆదేశించారు.

# మేలు జాతి పశువుల పెంపకం పట్ల రైతులు చొరవ చూపాలి

**పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త:** మేలు జాతి పశువుల యాజమాన్య పద్ధతుల్లో రైతులను చైతన్య పరిచే విధంగా రాష్ట్ర



ప్రభుత్వం ముందుకెళుతుందని ములుకుదురు పశువైద్యశాల వైద్యాధికారి షేక్ యాస్మిన్ అన్నారు. పశు సంరక్షణ యాజమాన్య పద్ధతులలో భాగంగా శనివారం పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు, చూలు పరీక్షలు, పలు రకాల వ్యాధులు గుర్తించి రైతులకు తగిన మందులను అందజేసినట్లుగా చెప్పారు. అధిక పాడి ఉత్పత్తిని పొందాలంటే మినరల్ మిక్చర్, పచ్చిగడ్డి పుష్కలంగా ఉండాలని, అందుకు ప్రతి రైతు కొంత భూమిని మేలు రక గ్రాసాలను పెంచేందుకు శ్రద్ధ వహించాలన్నారు. మండల పరిధిలోని గాయంవారిపాలెం, ఆరెమండ, మునిపల్లె గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. గాయంవారిపాలెం, ఆరెమండ గ్రామాల్లో పశువైద్యాధికారి డాక్టర్ ఉష, మునిపల్లె, ములుకుదురు గ్రామాల్లో డాక్టర్ షేక్ యాస్మిన్ పశువైద్య శిబిరాలను నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను రైతులకు అందజేశారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై బాబురావు

**వట్టిచెరుకూరు, జనవరి 24, ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉందని ఎస్సై బాబురావు హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభాతవార్త ప్రతినిధితో బుధవారం ఎస్సై మాట్లాడుతూ.. తప్పుడు లింకులు, నకిలీ సందేశాలు, ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలను మభ్యపెట్టి ఆర్థికంగా నష్టపరచే అవకాశం ఉందని తెలిపారు. గణతంత్ర దినోత్సవ బహుమతులు, గిఫ్ట్ కార్డులు, అమర



జవాన్లకు విరాళాలు, ఫ్లాగ్ పంపిణీ పేరుతో నకిలీ వెబ్ లింకులు పంపిస్తూ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం, ఓటీపీలు సేకరించి మోసాలకు కొన్ని ప్రదేశాలలో పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులపై క్లిక్ చేయరాదని, సోషల్ మీడియా లేదా వాట్సాప్ ద్వారా వచ్చే ఆఫర్లను నమ్మవద్దని, అధికారిక వెబ్‌సైట్‌లు, ధృవీకరించిన సమాచారాన్నే నమ్మాలని తెలియజేశారు. పాన్‌కార్డు, ఆధార్ కార్డు వివరాలు, ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత లింకుల్లో నమోదు చేయవద్దని, ఎలాంటి అనుమానాస్పద లింకులు వచ్చినా స్పందించకుండా ఉండాలని వివరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా సైబర్ ల్యాబ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదుల కోసం నేషనల్ సైబర్ హెల్ప్ లైన్ 1930కు కాల్ చేయవచ్చని, అలాగే డబల్యూడబల్యూ డబల్యూ.సైబరక్రైమ్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. బాధితుల సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని, భయపడకుండా పోలీసులకు సహకరించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 15 టైర్ 2 నగరాలలో హౌసింగ్ డాట్ కామ్ విస్తరణ

**అమరావతి, జనవరి 24, ప్రభాతవార్త :** భారతదేశంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ యాప్ హౌసింగ్.కామ్ దేశవ్యాప్తంగా 15 అధిక సామర్థ్య గల టైర్ 2 నగరాలలో వ్యూహాత్మక విస్తరణ పెరుగుతున్న నివాస మార్కెట్లలో హౌసింగ్.కామ్ యొక్క ప్రస్థానాన్ని మరింత బలోపేతం చేయడం మరియు మెట్రో నగరాలకన్నా దాటిన లక్షల కొత్త గృహ కొనుగోలుదారులకు డిజిటల్ ఫస్ట్ రియల్ ఎస్టేట్ అన్వేషణను అందించడం లక్ష్యంగా అగ్రా, ఔరంగాబాద్, జబల్పూర్, జోధ్పూర్, కాన్పూర్, లుధియానా, మదురై, మంగళూరు, మథురా, మైసూరు, రాంచి, త్రిచీ, ఉదయపూర్, వాపీ మరియు విజయవాడలో హౌసింగ్.కామ్ ఇప్పుడు మరింత విస్తృతమైన నగరాలలో స్థానికీకృత ప్రాపర్టీ శోధన అనుభవాలు, ధృవీకృత లిస్టింగ్స్, మరియు డేటా ఆధారిత అంతర్దృష్టులను అందిస్తుందని ఆర్.ఇ.ఎ. ఇండియా (హౌసింగ్.కామ్) ప్రవీణ్ శర్మ తెలిపారు.

# విద్యా ప్రమాణాలలో అగ్రస్థాయి ప్రభుత్వ మహిళా కళాశాల

## కళాశాల విద్య ఆర్జెడి డాక్టర్ పి కళావతి

**గుంటూరు విద్య జనవరి 24 ప్రభాతవార్త :** 8 దశాబ్దాలకు పైగా సుదీర్ఘ విద్యా చరిత్ర కలిగి స్వయం ప్రతిపత్తి కళాశాలగా ఎదిగిన ప్రభుత్వ మహిళా కళాశాల కోస్తా ఆంధ్ర లోనే మొదటి మహిళా కళాశాలగా గుర్తింపు పొంది ఉన్నత ప్రమాణాలతో విరాజిల్లడంలో పూర్వ విద్యార్థుల సంఘం కృషి ఎంతైనా ఉన్నదని కళాశాల విద్య ప్రాంతీయ పర్యవేక్షకురాలు(ఆర్జెడి) డాక్టర్ పి కళావతి పేర్కొన్నారు. స్థానిక సాంబశివపేట



ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) లేడీ హోప్ అలోమ్ని అసోసియేషన్ 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.1950 దశకం నుండి 2000 సంవత్సరం వరకు విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థినిలు ఆత్మీయ, పలకరింపులు, ఆలింగనాలతో కళాశాల గత స్మృతులను నెమరు వేసుకున్నారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన అల్యూమిని సాష్, బ్యాడ్జీలు ధరించి కళాశాల ఆవరణ అంతా కలియతిరిగారు. ఎస్బిఐ అధికారిగా పదవీ విరమణ చేసిన పూర్వ విద్యార్థిని భరతనాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అల్లరించాయి. ఎన్సిసి విద్యార్థినిలు ముఖ్య అతిథులకు, పూర్వ విద్యార్థినులకు గాడ్ ఆఫ్ ఆనర్ నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జ్యోతి వెలిగించి విశిష్ట అతిథిగా పాల్గొన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్వి సుందర చారి మాట్లాడుతూ కళాశాల గౌరవ ప్రతిష్టలకు పూర్వ విద్యార్థినులే పతాకాలుగా ఉంటారని చెప్పారు. గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు కోట్ల రూపాయల వితరణతో అత్యున్నత ప్రమాణాలతో కళాశాలను తీర్చిదిద్ది పూర్వవైభవాన్ని తీసుకొచ్చామని తెలియజేశారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థినిలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ ఏకాగ్రతతో తమ అనుకున్నా లక్ష్యాలను సాధించాలని కోరారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, పూర్వ విద్యార్థిని డాక్టర్ శనక్కాయల అరుణ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలను దేవాలయంగా భావిస్తూ నిత్యం కళాశాలకు నమస్కరించి తన వైద్య విధులు నిర్వహిస్తుంటానని చెప్పారు. తమలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఇంజనీర్లు డాక్టర్లు సివిల్ సర్వెంట్స్, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రమా జోత్స్న కుమారి మాట్లాడుతూ 28 శాఖలతో చదువుతో పాటే ఉద్యోగాలు కల్పించే అవకాశాలు తమ కళాశాల అందిస్తున్నదని చెప్పారు. అధ్యాపకుల, విద్యార్థినిల అవసరాలకు అనుగుణంగా జాతీయ బ్యాంక్ ఏటిఎం ఏర్పాటు చేసేలా ప్రయత్నిస్తున్నట్లు తెలియ చేశారు.

# ఆంధ్ర లూథరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం

**గుంటూరు విద్య జనవరి 24 ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన ..స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర.. కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా లూథరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ గుంటూరు నందు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్తేరు సునీలా ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ డాక్టర్ ఇన్నారెడ్డి తో కలిసి విద్యార్థులందరూ కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేసి అవసరమైన చోట బ్లీచింగ్ చల్లి పరిసరాల పరిశుభ్రత గురించి స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ర్యాలీ నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో సచివాలయ శానిటరీ ఇన్స్పెక్టర్ పూర్ణ కుమారి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ వెస్లీ, డాక్టర్ అరవింద్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ శేఖర్ ,డాక్టర్ కిషోర్ మరియు అధ్యాపకేతర సిబ్బంది, సచివాలయ అడ్మిన్ సతీష్ మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలిక శక్తి దేశానికి ప్రాణాధారం : డా॥ఎస్ విద్యాధర

**గుంటూరు విద్య జనవరి 24 ప్రభాతవార్త:** స్థానిక చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఖీజాతీయ బాలికా దినోత్సవాన్నిఖీ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖీదేశాభివృద్ధిలో బాలికల పాత్రఖీ అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విద్యాధర మాట్లాడుతూ, సమాజంలో బాలికల పట్ల ఉన్న వివక్షను పోగొట్టి, వారికి సమాన అవకాశాలు కల్పించినప్పుడే దేశం పురోగమిస్తుందని పేర్కొన్నారు. నేటి తరం బాలికలు అన్ని రంగాలలో



పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, వారి రక్షణ మరియు విద్య పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, పథకాలపై అవగాహన పెంచుకుని, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థినులకు సూచించారు.అనంతరం వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. జె. సుబ్బారావు తో పాటు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ మేధా కళాశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**గుంటూరు విద్య జనవరి 24, ప్రభాతవార్త :** జ్ఞానానికి, కళలకు, సంగీతానికి, ఆదిదేవత చదువుల తల్లి సరస్వతి దేవి అని వసంత



పంచమినీ ఆమె పుట్టినరోజుగా జరుపుకోవాలని మన సాంప్రదా యామని శ్రీ మేధా విద్యాసంస్థల చైర్మన్ సిపి అన్న నందకిషోర్ అన్నారు. కొత్తపేట లక్ష్మీ భవన్ క్యాంపస్‌లో నిర్వహించిన వసంత పంచమి సరస్వతి పూజా కార్యక్రమంలో నందకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలోని అజ్ఞాన తిమిరాన్ని పాలద్రోలి విజ్ఞానమనే కాంతిని ప్రసాదించే దేవత సరస్వతి దేవి అని ఆయన అభివర్ణించారు. ఈ వసంత పంచమి వేడుకలు విద్యార్థులలో విద్యాసక్తిని పెంపొందించి జ్ఞాన సముపార్జనకు దోహదం చేస్తాయని ఆయన తెలిపారు .శ్రీ మేధా విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పరీక్షలలో అత్యుత్తమ మార్కులతో విజయం సాధించాలని కోరారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ వేడుకలు అత్యంత సాంప్రదాయాల మధ్య జరిగాయి. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా దుస్తులు ధరించి ఈ వేడుకలలో పాల్గొన్నారు. అధ్యాపకులు సిబ్బందితోపాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో..నారా లోకేష్ జన్మదిన వేడుకలు

**గుంటూరు విద్య జనవరి 24 ప్రభాతవార్త :** గుంటూరు,నెహ్రూ నగర్ నందలి శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలో,రాష్ట్ర విద్యా శాఖా మాత్యులు గౌ!!లు నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీవికాస్ విద్యా సంస్థల అధినేత:దాసరి రాజా మాష్టారు ముఖ్య అతిథిగా హాజరై, లోకేష్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి,విద్యార్థినీ విద్యార్థులకు మిఠాయిలు పంచారు.ఈ సందర్భముగా రాజా మాష్టారు లోకేష్



గురించి మాట్లాడారు కష్టముతో కూడిన విద్యా శాఖను నడిపించడంలో సఫలీకృతులు అయ్యారన్నారు.16 వేల టీచర్ పోస్టులు లోకేష్ నాయకత్వములో డీఎస్సీ ద్వారా భర్తీ చేశారని, విద్యా శాఖతోపాటు, బాల,బాలికల భవిషత్తు కోసం అనేక కీలక నిర్ణయాలను తీసుకుని లోకేష్ చరిత్రసృష్టించారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# టిట్కో గృహ సముదాయాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

## అధికారులకు బాధితుల వేడుకోలు

**గుంటూరు విద్య జనవరి 24 ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని నల్లపాడు పోలీస్ స్టేషన్ వెనుక వైపు ప్రాంతంలో ఉన్న టిట్కో గృహ సముదాయాలలో సరైన త్రాగునీరు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు ఇక్కట్లు పడుతున్నారని అధికారులు తక్షణ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని స్వర్ణాంధ్ర



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానికంగా సరఫరా అవుతున్న త్రాగునీరు కలుషితముగా ఉందని అవి తాగితే వాంతులు, విరోచనాలతో పాటు అనారోగ్య లక్షణాలు జనాల్లో కనిపిస్తున్నాయని ఏసుబాబు మాదిగ వాపోయారు. త్రాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని రక్షిత మంచినీటి పథకాన్ని అమలు పరచాలని స్థానికులు కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి తద్వారా ఫిల్టర్ వాటర్ ను స్థానికులకు అందిస్తే సమస్య కొంతవరకు అయినా పరిష్కారం అవుతుందని ,ఆ మేరకు అధికారులు ఆలోచన చేయాలని ఏసుబాబు మాదిగ విజ్ఞప్తి చేశారు. వందలాది కుటుంబాలు స్థానికంగా గృహ సముదాయాల్లో ఉన్నాయని సమస్య పరిష్కారం కొరకు చిత్తశుద్ధితో అధికారులు కృషి చేయాలని స్థానికులు అధికారులకు విన్నవించుకున్నారు.

# దేశవ్యాప్త కార్మికసమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు పిలుపు

**తెనాలి టౌన్ జనవరి24(ప్రభాతవార్త):** ఫిబ్రవరి 12న జరుగు తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని,సీఐటీయూ గుంటూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే.బాబు ప్రసాద్ పిలుపునిచ్చారు.శనివారం చెంచుపేట లోని సిఐటియు ప్రజాసంఘాల



కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ తెనాలి డివిజన్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ సమ్మెగురించి,సమ్మె చేయవలసిన పరిస్థితి యెందుకు వచ్చిందో కార్మికులకు వివరించాలని సూచించారు.అఖిల భారతస్థాయిలో కార్మిక సంఘాలతో చర్చలు లేకుండానే ప్రభుత్వం ఏకపక్షం గా,నిరంకుశముగా నాల్గు లేబర్ కోడ్ లను అమలుకు పూనుకున్న విషయం కార్మిక వర్గానికి చెప్పాలని కోరారు. సమ్మె గురించి పని ప్రదేశాల్లో నే కాకుండా నివాస ప్రాంతాల్లో కూడా ప్రచారం చెయ్యాలని సూచించారు. ముఖ్యంగా మహిళా కార్మికులు తమకుటుంబాల లో చర్చ పెట్టాలని సూచించారు.కుటుంబ సభ్యులను కూడా కలుపుకుని రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడి దారుల అంతులేని లాభాల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలను అమలు చేయాలని చూస్తుందన్నారు. రైతుసంఘాల పోరాటానికి ప్రభుత్వం మెడలు వంచక తప్ప లేదని,మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసుకున్నారు అని చెప్పారు.తనకు రాజకీయ పార్టీల మద్దతు వుందని ప్రభుత్వం బలప్రయోగం చేయాలని చూస్తున్నారని అది సాధ్యం కాదని చెప్పారు. రైతులస్పూర్తితో పోరాటం చేస్తామని నాల్గు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు సీఐటీయూ ముందుండి పోరాటం చేస్తామని చెప్పారు. సభకు అంగన్వాడీ జిల్లా కార్యదర్శి ఏవిఎన్.కుమారి అధ్యక్షత వహించారు.సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్.హుస్సేన్ వలి ప్రచార కార్యక్రమం వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు డాల్ మిల్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు,మార్కెట్ యార్డు ముఠా కార్మిక సంఘం నాయకులు, అంగన్వాడీ సంఘం, హెల్త్ డిపార్ట్మెంట్ సంఘం, ఎలక్ట్రిసిటీ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆంధ్రాలో కనుమరుగవుతున్న సినిమాహాళ్ళు : మా ఏపి ఆందోళన

**తెనాలి టౌన్ జనవరి24(ప్రభాతవార్త):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఒకప్పుడు రెండువేలకుపైగా ఉన్న సినిమా థియేటర్లలో 1094 మూతబడిపోయా యనిఖి మాఏపిఖివ్యవస్థాపకులు,సినీదర్శకుడు దిలీప్ రాజా ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక ఖిమాఏపిఖి కార్యాల్నయలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో విన్నోద కనుమరుగయ్యే ప్రమాదం పొంచివుందన్నారు.విద్యుత్ చార్జీలు కూడా చెల్లించలేనిస్తితిలో



ఆంధ్రాలో సినిమా హాళ్ళు షాపింగ్ మాల్స్ గానూ కళ్యాణమండపాలుగా మారాయని ఆయన వివరించారు.భారత దేశంలో 6877 థియేటర్లుండగా అగ్రస్థానంలో ఆంధ్ర ప్రదేశ్ ఉందని 987 థియేటర్లతో తమిళనాడు రెండో స్థానంలోనూ కర్ణాటక 719 తో మూడో స్థానంలో ఉన్నాయని ఆయన తెలిపారు. ఒకప్పుడు సినిమాహాళ్ళు ప్రేక్షకులతో కిటకిట లాడాయని ప్రస్తుతం అగ్రహీరోల సినిమాలకు మినహా వెలవెల బోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్త చేశారు.ఈ పరిస్థితిని అధిగమ్నిచ డానికి ప్రభుత్వం ఒక కార్యచరణ పద్ధతికి శ్రీకారం చుట్టాలని ఆయన పేర్కొన్నారు.పైగా ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధి ఎండమావిలా మారిందన్నారు.కేవలం 180 థియేటర్లున్న ఒరిస్సా రాష్ట్రంలో అక్కడ ప్రభుత్వం సినిమాలకు సబ్సిడిగా 2.5 కోట్ల వరకు చెల్లిస్తుంటే ఆంధ్రలో 10 లక్షలు సబ్సిడీ ప్రకటించడం విడ్డూరంగా ఉందని దిలీప్ రాజా చెప్పారు.కాగా ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 నుండి ఇప్పటి వరకు ఆ పదిలక్షల రూపాయల సబ్సిడీ కూడా ఏఒక్కనిర్మాణ సంస్థకూ చెల్లించలేదని ఆయన ఆరోపించారు.ఆంధ్ర ప్రదేశ్ సినిమా రెగ్యులేటింగ్ యాక్ట్ 1955 ప్రకారంగా సినిమా థియే టర్లున్నాయాని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెంటిటర్ పై ఉన్న సినీ పరిశ్రమకు ఆక్సిజన్ అందజేయాల్సిందిగా దిలీప్ రాజా ప్రభుత్వానికి మనవి చేశారు.సమావేశంలో సహాయ దర్శకులు గాజులపల్లి రాముడు, నరేష్ దోనే తదితరులు పాల్గొన్నారు.

# చెత్త నిల్వలను తరలించండి

## పారిశుద్ధ్య సిబ్బందికి ఎంహెచ్ఓ సూచన

**తెనాలి మున్సిపాలిటీ జనవరి24(ప్రభాతవార్త):** వీధుల్లోని చెత్త నిల్వలను ఎప్పటికప్పుడు తరలిస్తూ పట్టణ పరిశుభ్రతకి ప్రాధాన్యం ఇవ్వాలని అలాగే మరుగు కాలవల్లోని నీటిపారుదలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పురపాలక సంఘ ఆరోగ్య అధికారి మొవ్వ ఏసుబాబు పారిశుద్ధ్య కార్మికు లకు సూచించారు. శనివారం మున్సిపల్ ఆరోగ్యశాఖాదికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు,3వ వార్డు వార్డు లోని ఈటీ కాలనీ, డ్నాగే వీధి,భాస్కర రావు దిబ్బ, మరియు పాలద్రి



కాలువలను పరిశీలించి,సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, నీటిపారుదలకు ఆటంకం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పాలద్రి కాలవ లో అక్కడక్కడ ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలనీ సిబ్బందికి సూచించారు. ఆ వార్డులో జరుగుతున్న డోర్ టు డోర్ చెత్త సేకరణ పను లను పరిశీలించారు. వార్డు లలో చెత్తను తరలించే ట్రాక్టర్ డ్రైవర్, పని వారితో మాట్లాడి,పాయింట్ లలో చెత్త నిల్వ ఉండకుండా చూసుకోవాలని శానిటరీ సెక్రటరీ లకు సూచించారు. ఆయా వార్డు లలో స్థానిక ప్రజలతో, దుకాణ దారులతో మాట్లాడి,చెత్తను కాలువలలో వేయకుండా పురపాలక సంఘ వాహనాలకు ఇవ్వాలని కోరారు. శానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమ, శానిటరీ సెక్రటరీ లు, స్నిబ్బది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుకు ప్రభుత్వం చర్యలు

**కొల్లిపర, జనవరి 24, ప్రభాతవార్త:** డ్వాక్రా మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నదని ఎపిఎం రమాదేవి చెప్పారు.శనివారం కొల్లిపర స్త్రీ శక్తి భవనంలో డ్వాక్రా మహిళలకు పుస్తక నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ మన డబ్బులు మన లెక్కలు యాప్‌పై అవగాహన అవసరమన్నారు.ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన పుస్తక నిర్వహణను ప్రవేశపెట్టిందని ఆమె తెలిపారు.ఈ నారీని నియమించి ప్రత్యేక శిక్షణనిచ్చి డిజిటల్ పుస్తక నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు.డ్వాక్రా మహిళలు తమ గ్రూపు పొదుపు రుణాలు,వ్యయాలను ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో నమోదు చేసుకోవడం వలన ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు బుజ్జిబాబు,విజయ్‌కుమార్,ప్రమీలాదేవి,టి.మధు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లలో సమన్వయం పాటిద్దాం : ఆర్డిఓ

**అమర్తలూరు మండలం జనవరి24(ప్రభాతవార్త):** మహాశివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని,రేపల్లె సబ్ కలెక్టర్ ఎన్.రామలక్ష్మి పేర్కొన్నారు.శుక్రవారం బాపట్ల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన



అమర్తలూరు మండలం,గోవాడ గ్రామంలో కొలువైన,శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేయవలసిన మౌలిక వసతులు భక్తులకు కల్పించవలసిన సౌకర్యాలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో, రేపల్లె సబ్ కలెక్టర్ రామలక్ష్మి, డిఎస్పి ఆవుల సాంబశివరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. సభకు శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ అధ్యక్షులు పావులూరి రమేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ, మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ప్రధానంగా పోలీస్ శాఖ సందీప్ భద్రతలు లో ఎటువంటి రాజీ పడకుండా తమ విధులను నిర్వర్తించాలని అలాగే విద్యుత్ రెవిన్యూ ఫైర్ సిబ్బంది అందుబాటులో ఉండి నిరంతరం క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఒకరికొకరు సమన్వయంతో దేవస్థాన సిబ్బందికి సహకరిస్తూ అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు. డి.ఎస్.పి సాంబశివరావు మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా పోలీసు శాఖ తరపున పూర్తి బందోబస్తు నిర్వహిస్తామని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించమని శాంతి భద్రతల విషయంలో రాజీ పడే మాట లేదని స్పష్టం చేశారు.

# సచ్చిదానందమూర్తికి ఘన నివాళులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి24, ప్రభాతవార్త:** పద్మ భూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తికి ఏఎన్‌యు ఘన నివాళులు అర్పించింది. 115వ వర్ధంతి సందర్భంగా బౌద్ధశాస్త్ర విభాగం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళుల అర్పించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య కొత్తా సచ్చిదానంద మూర్తి సెంటర్ ఫర్ ఆఫ్రోఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య యం.త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసి ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఏఎన్‌యు ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్‌లు సచ్చిదానందమూర్తి సేవలను కొనియాడారు. ఆయన యువతకు ఆదర్శం అన్నారు. ఆచార్య కె.వీరయ్య, ఆచార్య కె.తేజోమూర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి, సిడిఇ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, ఆచార్య స్వరూపరాణి, ఉదయకుమార్, సీతారావమ్మ, డా.దిలీస్, సిఇ శివప్రసాదరావు, వై.రాధాకృష్ణ, ఎం.వి.రమణ, డా. కోటీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల,జనవరి24,ప్రభాతవార్త:** కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ కవాతు మైదానంలో నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. స్థానిక పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ శనివారం పరిశీలించారు. అధికారులతో అక్కడే సమావేశమయ్యారు. ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలీస్ కవాతు మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని మార్గం నిర్దేశం చేశారు. జిల్లాలో జరిగే వేడుకలు వైభవంగా ఉండాలన్నారు. వేడుకలకు హాజరయ్యే అతిథులు, అధికారులు, ప్రజలు, చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాంగణమంతా మువ్వెన్నెల జెండాలు రెపరెపలాడాలని, అందుకొరకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అతిథులు, చిన్నారులకు స్నాక్స్ సిద్ధం



చేసుకోవాలన్నారు. జిల్లాలో ప్రగతిని చాటేలా శకటాలు, స్టాల్స్ ప్రదర్శన ఉండాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, డిఆర్ఓ జి.గంగా ధర్ గౌడ్, ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# పర్యాటక రంగం అభివృద్ధికి ఆదర్శవేదిక వినతి

రేపల్లె, జనవరి 24, ప్రభాతవార్త:పుణ్య క్షేత్రాలు కొలువుదీరిన ప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని చెట్లను నాటించాలని కిషోర్‌బాబు కోరారు.కృష్ణా కరకట్ట ఆధునీకరణ వలన వృక్షాలను పెంచితే భూగర్భజలాలను రక్షించవచ్చునని ఆయన సూచించారు



సత్యప్రసాద్‌కు శనివారం రేపల్లె పట్టణ ఆదర్శవేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు వినతిపత్రం సమర్పించారు. పెనుమూడి–మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయం వరకు కృష్ణా కరకట్ట ఆధునీకరణతో పాటు రహదారి మార్గానికి ఇరువైపులా మామిడి,జామ,వేప,నేరేడు,గానుగ,మర్రి .మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంట మన్నారు.మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలసినవారిలో కొడాలి ఆనంద్,పి.సుజాత,టి.శ్రావణసంధ్య,జె.దేవయాని,బి.విజయలక్ష్మి,బి.ఆదిలక్ష్మి,బి.అంజలి తదితరులు ఉన్నారు.

# బాలికలు వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్నటువంటి సేవలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలి

పెదనందిపాడు జనవరి 24 (ప్రభాతవార్త) జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో పనిచేయుచున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ హై స్కూల్స్ మరియు ఎంపీపీ స్కూల్స్‌లో ఉన్న విద్యార్థినులకు (బాలికలు) నేటి జాతీయ బాలిక దినోత్సవం ప్రాముఖ్యత గురించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా పెదనందిపాడు నంది హై స్కూల్ ను సందర్శించిన పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ బి. ప్రియంవద అక్కడ ఏర్పాటు చేసిన



సమావేశంలో జాతీయ బాలిక దినోత్సవం గురించి మాట్లాడుతూ, బాలికలను ఆరోగ్యపరంగా ఉంచేందుకు గాను వైద్య ఆరోగ్యశాఖఅందిస్తున్నటువంటి అన్ని సేవలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని,సామాజికంగా బాలిక ల పట్ల ఇతరులు ప్రవర్తిస్తున్న తీరును తెలియపరుస్తూ,గుడ్ హ్యాబిట్స్, బ్యాడ్ హ్యాబిట్స్ పై బాలికలలో అవగాహన కల్పించారు.అదేవిధంగా రాబోవు కాలంలో గర్భాశయ క్యాన్సర్ రాకుండా (14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలు)ఉండేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రారంభమవుతున్న. హెచ్.పి. వి. వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని,అలాగే బహిష్టు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు రక్తహీనత కు గురి కాకుండా ఉండేందుకు పోషకాహారం తీసుకోవలసిన ఆవశ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో సిహెచ్ఓ ఎస్.ఆర్. ప్రసాద స్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ షేక్ సుజా,పెదనందిపాడు మండల ఆరోగ్య కేంద్రం కు చెందిన కె.రత్నకుమారి, షేక్ సాధాఖోన్, పెదనందిపాడు 2 గ్రామ సచివాలయం ఏ ఎన్ ఎం. ఏ భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ కార్యకర్తలు మరియు సచివాలయపు మహిళా పోలీలు పాల్గొన్నారు. నంది హైస్కూల్ ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

# రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రధానం

**తెనాలి టౌన్ జనవరి24(ప్రభాతవార్త):** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో, వివిధరంగాల్లోని నిష్ణాతులకు ఒకేషనల్ ఎక్సెన్స్ అవార్డ్స్ 2026 లను ప్రధాన చేశారు.శనివారం స్థానిక బస్ స్టాండింగ్ అవుట్ గేటు ఎదురుగా గల ఈ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నందు ఒకేషనల్ ఎక్సెన్స్ అవార్డ్స్2026 లను వివిధ రంగాలలో నిష్ణాతులైన బ్యాంకింగ్ రంగంలో దావులూరి లక్ష్మీ కాంతారావు, పోస్టల్ డిపార్ట్మెంట్లో కొల్లూరు రమేష్,కల్చరల్ విభాగంలో గెరా రాజశేఖర్,ఏపీఎస్ఆర్టీసీ లో దేవిరెడ్డి సాంబయ్య,యోగ



గురువు కెవిన్‌కె కిషోర్, సోషల్ సర్వీస్ ది తెనాలి టౌన్ అండ్ సరౌండింగ్ డెవలప్మెంట్ అసోసియేషన్,రోటరీ విభాగంలో ఆలపాటి కిరణ్ చౌదరి లను అవార్డులతో సన్మానించారు. ఈ సన్మానంతో తమ బాధ్యత మరింత పెరిగిందని సన్మాన గ్రహీతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం అధ్యక్షులు క్లబ్ నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన, పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.రామారావు ముఖ్యఅతిథిగా, డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి,అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్,కార్యదర్శి జి. వెంకటనారాయణ,రోటరీ సభ్యులు,సన్మాన గ్రహీతల కుటుంబసభ్యులు,స్నేహితులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**వట్టిచెరుకూరు, జనవరి 24, ప్రభాతవార్త :** ప్రతిఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛ పరిపాలన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తమ పరిసరాలను శుభ్రంగా



అవసరమని తహసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం రెవెన్యూ సిబ్బంది స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చీపుర్లు పట్టి ప్రాంగణం మొత్తాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుత .ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేందుకు గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది రాష్ట్రాన్ని ఖిస్వర్ణ ఆంధ్రఖిగా మార్చడమే లక్ష్యంగా చేపట్టిన ఖిస్వర్ణ ఆంధ్ర ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత మండలం కోసం తడిపొడి చెత్త వేరు చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూనే, స్వచ్ఛతలో కూడా అగ్రగామిగా నిలపాలని, దానికి మన వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్వచ్ఛందర ప్రతిజ్ఞ చేయడం జరిగింది.కార్యక్రమంలో వీఆర్ఏలు ఆరుమళ్ళ మత్తయ్య, నల్లపాటి వీరయ్య, చుక్క సాంబయ్య, నూతక్కి ప్రకాశం, గేరా బాబు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి

వట్టిచెరుకూరు, జనవరి 24, ప్రభాతవార్త : సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి డాక్టర్ కోటేశ్వరమ్మ పేర్కొన్నారు. మండలంలోని శివారు గ్రామం కారంపూడిపాడులో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య



శిబిరంలో పశువైద్యాధికారి కోటేశ్వరమ్మ పాల్గొని మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత అధిక ఉష్ణోగ్రతల వల్ల పాడి పశువులు ఒత్తిడికి, అసౌకర్యానికి లోనవుతాయన్నారు. తద్వారా మేత తీసుకోవడం తగ్గిపోతుందని వివరించారు. దీనితో పాల దిగుబడి, వెన్న శాతం తగ్గిపోతుందని, ఇలాంటి పరిస్థితులను అధిక మించేందుకు పశు సంరక్షణకు రోజువారి యాజమాన్య పద్ధతులను పాటించాల్సి ఉందని చెప్పారు. పచ్చిమేత సరిపడనంత అందుబాటులో లేనప్పుడు సైలేజ్, టిఎమ్ఆర్, అజోల్లాను వాడవచ్చని వివరించారు. అనంతరం పాడి పశువులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా లివర్ టానిక్కులు, మినరల్ మిక్సర్ పాకెట్లు అందజేశారు. ఈ శిబిరంలో 30 గేదెలు, 22 దూడలు, 40 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 10 పశువులకు గర్భకోశా నివారణ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో జెవిఓ ఝాన్సీరాణి, ఎల్ఎస్ఏ పాల్ ప్రసాద్, ఏహెచ్ఏలు హేమలత, సతీష్, ఓఎస్ పెదబాబు, పశు యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సాంస్కృతిక పోటీలు

**గుంటూరు విద్య జనవరి 24 ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆర్ట్స్ మరియు కల్చరల్ యాక్టివిటీస్,ఈవెంట్స్ స్థానిక బ్రాడీపేటలో గల శారద విద్యానికేతన్ భవిత సెంటర్ నందు నిర్వహించబడినాయి.. వీటిలో జిల్లాలోని 18 మండలాల భవిత కేంద్రాలు మరియు వివిధ ప్రభుత్వ మరియు పాఠశాలల నుంచి 150 మందికి పైగా పిల్లలు మరియు వారి తల్లి దండ్రులు హాజరైనారు. తల్లిదండ్రులు మరియు టీచర్స్ వారి పిల్లలను వివిధ రకాల ఆక్టివిటీస్‌లో వారందరినీ కూడా వివిధ ఈవెంట్స్‌లో పార్టీస్పేట్ చేయించారు ఈవెంట్స్‌లో ఆర్ట్‌కు సంబంధించి వివిధ రకాల











డ్రాయింగ్లు మరియు క్లేమోడల్‌లో పిల్లలచే రకరకాల బొమ్మలు తయారు చేయించడం జరిగింది. అలాగే కల్చరల్ విభాగంలో ఫ్యాషన్ షో నిర్వహించడం జరిగింది. నృత్యము వ్యక్తిగత విభాగంలోనూ మరియు గ్రూపు విభాగం లోను నిర్వహించడం జరిగింది. ఈ ఈవెంట్స్ లో మెరిట్ వారికి సర్టిఫికెట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమము జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష గుంటూరు శ్రీమతి ఐ పద్మావతి గారి ఆధ్వర్యంలో విజయవంతంగా కంప్లీట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో జిల్లా సహిత విద్యా విభాగం సమన్వయకర్త శ్రీ శ్రీనివాస రావు మరియు వివిధ మండలాల నుంచి ఐఈడిఎస్ఎస్ స్పెషల్ ఎడ్యుకేటర్స్ మరియు ఐఈఆర్పిలు తల్లిదండ్రులు పిల్లలు హాజరైనారు

# క్షీర విప్లవానికి నాంది పలికిన ఘనత మాజీ మంత్రి స్వర్గీయ వీరయ్య చౌదరిదే

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, జనవరి 24,ప్రభాతవార్త: క్షీర విప్లవానికి నాంది పలికిన నాయకులలో మాజీ మంత్రి వర్యులు మా తండ్రి గారైన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ఒకరని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. శనివారం చింతలపూడి గ్రామంలో వీరయ్య చౌదరి వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పాడిరైతులకు దిశానిర్దేశాన్ని చూపించిన డెయిరీలలో మన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంగం డెయిరీ ఒకటన్నారు. సంగం డెయిరీ ఉత్పత్తులను, నాణ్యతను పెంచడంలో వీరయ్య చౌదరి చూయించిన చొరవ వల్లే నేడు పాడి రైతుకు తగిన గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఇక రాజకీయాలలో తనదైన ముద్రవేసి పొన్నూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో వ్యవసాయ ఆధునీకతకు శ్రీకారం చుట్టారన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు చివర భూములకు సైతం నీరిచ్చి పెదనందిపాడు ఎత్తుపోతల పథకం ద్వారా ఆ రైతుల హృదయాలను కొల్లగొట్టుకొని కృషీవలుడుగా ముద్రవేయబడ్డారని ఉద్ఘాటించారు. చింతలపూడి గ్రామంలో సామాన్య రాజకీయనాయకునిగా తొలి అడుగు వేసి ప్రజాభిమానంతో పాడి రైతులను కష్టసుఖాలను పరిష్కరించే దిశగా ఆనాడా సంగం డెయిరీ ఛైర్మన్‌గా పనిచేశారన్నారు. ఆయన ప్రతిభా పాఠవాలను గుర్తించిన నందమూరి తారకరామారావు పార్టీ ఆవిర్భావంలోనే వీరయ్య చౌదరికి సముచిత స్థానాన్ని కల్పించి ఆ తర్వాత మంత్రిగా పదవినిచ్చి వెన్ను తట్టడం విశేషమన్నారు. వీరయ్య చౌదరి ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తొలుత చింతలపూడిలోని వీరయ్య చౌదరి



సమాధివద్ద పుష్పగుచ్చాలను ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ వీరయ్య చౌదరితోపాటు ఆయన సతీమణి, డీవీసి హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ ఫ్లిప్‌కార్ట్ క్రాఫ్టెడ్ బై భారత్ సేల్

**విజయవాడ, జనవరి 24, ప్రభాతవార్త :** స్వదేశీ ఈకామర్స్ మార్కెట్‌ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ తన ప్రధాన కార్యక్రమమైన సామర్థ్ సేల్ ఈవెంట్ క్రాఫ్టెడ్ బై భారత్ 11వ సంచికను ప్రకటించింది. 26న జరగనున్న ఈ సేల్, భారత గణతంత్ర దినోత్సవం 77వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్లిప్‌కార్ట్ యాప్, వెబ్ ప్లాట్‌ఫారమ్‌లపై ప్రత్యేకంగా రూపొందించిన క్రాఫ్టెడ్ బై భారత్ స్టోర్‌ఫ్రంట్‌లో వార్లీ, పట్టచిత్ర, మధుబని, పిచ్వాయ్, టెర్రకోట వంటి 200కు పైగా సంప్రదాయ కళారూపాలే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న 2,300 మంది పైగా కళాకారులు, నేతకారులు, చిన్న వ్యాపారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించనుండగా, ప్రతి ఉత్పత్తి భారతదేశపు స్థానిక సంస్కృతి, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుంది.

